మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట



# తెలియని వెబ్‌సైట్లతో జాగ్రత్తగా ఉండాలి

**మోసపోయామని గ్రహించిన వెంటనే 1930కు సమాచారం ఇవ్వాలి: పేట ఎస్పీ డా. వినీత్**

**నారాయణపేట, డిసెంబరు 28 ప్రభాతవార్త :** పేట జిల్లా ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ డా.వినీత్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుత సమాజంలో సైబర్ నేరగాళ్లు నూతన పద్ధతులను ఉపయోగించి ప్రజలను మోసగిస్తున్న నేపథ్యంలో అవగాహనతో పాటు అప్రమత్తతతోనే సైబర్ నేరాలను సమర్థవంతంగా అడ్డుకోగలమని పేర్కొన్నారు. ప్రస్తుతం ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్లు,స్టాక్ మార్కెట్‌లో అధిక లాభాలు చూపిస్తామంటూ ప్రైవేట్‌వ్యక్తులు చేస్తున్న మోసాలు సామాన్య ప్రజలను తీవ్రంగా నష్టపరుస్తున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే వాట్సాప్, టెలిగ్రామ్ తదితర సోషల్ మీడియా మాధ్యమాల ద్వారా పంపిస్తున్న ఏపీకే ఫైల్స్ ద్వారా మొబైల్ ఫోన్లపై సైబర్ నేరగాళ్లకు సమాచారం వెళ్లే ప్రమాదం ఉందని హెచ్చరించారు. తెలియని లింకులు, ఏపీకే ఫైల్స్ డౌన్‌లోడ్ చేయకుండా ఉండటమే ప్రధానరక్షణగా పేర్కొన్నారు.ఒకవేళ సైబర్ మోసం జరిగినట్లు గ్రహించిన వెంటనే గోల్డెన్ అవర్‌లో జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నెంబర్ 1930కు సమాచారం ఇవ్వాలని లేదా సైబర్ క్రైమ్ వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని ఎస్పీ సూచించారు. ప్రస్తుతం సైబర్ నేరగాళ్లు ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్, లోన్ ఫ్రాడ్, యూపీఐ ఫ్రాడ్, ఏపీకే ఫైల్స్, నకిలీ వెబ్‌సైట్లు స్టాక్ మార్కెట్ ఫ్రాడ్ వంటి పద్ధతులు ఉపయోగిస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా యువత అధిక లాభాల ఆశలో మాయమాటలకు నమ్మి మోసపోకూడదని హెచ్చరించారు. ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్లలో నేరగాళ్లు తమ స్వంత వెబ్‌సైట్లలో పెట్టుబడిపై అధికలాభాలు చూపించి, డబ్బులు ఉపసంహరించుకునే సమయంలో అందకుండా మోసం చేస్తున్నారని వివరించారు.జిల్లా పరిధిలో ప్రజలకు సైబర్ నేరాలపై విస్తృత అవగాహన కల్పించే కార్యక్రమాలను మరింత విస్తరించాలని పోలీసు అధికారులకు సూచించినట్లు ఎస్పీ తెలిపారు.





పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న సంజీవ్ ముదిరాజ్

## పార్టీలో గ్రూపులకు తావులేదు

- జెండా మోసిన వారికి మా అండ
- డీసీసీ అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్
- ఉపాధి పథకాన్ని నిర్వీర్యం చేస్తున్న కేంద్రం
- ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి
- మహబూబ్‌నగర్ డిసిసిలో కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం

**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబరు 28 ప్రభాతవార్త :** పార్టీకి జెండా మోసిన వారికి అన్ని విధాలుగా అండగా ఉంటామని డిసిసి అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీలో గ్రూపులకు తావు లేదని, వ్యక్తులు కాదని పార్టీ ముఖ్యమని డీసిసి అధ్యక్షుడు అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. పార్టీ జెండాను డీసీసీ అధ్యక్షులు ఆవిష్కరించారు. సమావేశంలో డీసీసీ అధ్యక్షులు మాట్లాడుతూ రాహుల్ గాంధీ ని ప్రధానమంత్రి చేయడమే లక్ష్యంగా పనిచేద్దామని –మిగతా4లో..



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జీఎంఆర్

## భూత్పూర్ మున్సిపాలిటీకి కొత్త సొబగులు

- వార్డుల్లో ఆధునాతన హైమాస్ట్ లైట్లు
- రెండు వార్డులలో వాటర్‌ప్లాంట్లు
- పలు వార్డులలో కమ్యూనిటీ భవనాలు
- వారం రోజుల్లో పనులను ప్రారంభిస్తామన్న ఎమ్మెల్యే

**భూత్పూర్,డిసెంబర్ 28,ప్రభాతవార్త :** గ్రామ పంచాయతీ స్థాయి నుంచి మున్సిపాలిటీ స్థాయికెదిగిన భూత్పూర్ మున్సిపాలిటీ ఎమ్మెల్యే జీఎంఆర్ చొరవతో కొత్త సొబగులు పొసగనుంది.భూత్పూర్ మున్సిపాలిటీకి టీడీఎస్ నుంచి రు.మూడు కోట్లు,ముడా నుంచి రు.కోటి మంజూరైన నేపథ్యంలో పనులకు వారం రోజుల్లో వచ్చే నెల 4,5తేదీలలోశ్రీకారం చుట్టాలని దేవరకద్ర ఎమ్మెల్యే గవినోళ్ల మధుసూధన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు.ఆదివారం భూత్పూర్ మున్సిపాలిటీ సమావేశహాల్‌లో ఏర్పాటు చేసిన వార్డుల సమీక్షా సమావేశంలో ఆయన ప్రసంగించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీఎంఆర్ మాట్లాడుతూ భూత్పూర్ మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో – మిగతా4లో..




సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

## మేధా సంపత్తి తెలంగాణ కవులకు సొంతం

- "ఖాళీ కుర్చీ" సందేశం
- వాగ్దానానికి భంగం కలిగినప్పుడు ప్రశ్నించడం
- ప్రజల హక్కు : మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

**వనపర్తి, డిసెంబరు 28 ప్రభాతవార్త:**"ఖాళీ కుర్చీ"కవిత సంపుటి ఆవిష్కరణలో మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి పాల్గొన్నారు. ఆదివారం గంగవరం రామకృష్ణారెడ్డి రచించిన ఖాళీ కుర్చీ కవిత సంపుటి ఆవిష్కరణ (టిఎన్‌జిఒ)భవన్లో జరిగింది. ఆవిష్కరణలో ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి పాల్గొని పుస్తకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ – మిగతా4లో..

# దత్తత పేరుతో గురుశిష్యుల దగా..



ర్యాలీలో పాల్గొన్న పార్టీ శ్రేణులు

- పాలమూరు ఎత్తిపోతల పూర్తి చేస్తే కెసిఆర్ కు పేరు వస్తుందని కుట్ర..
- రెండేళ్లు పూర్తయిన ప్రాజెక్టులో తట్ట మట్టి తీయలే..
- పాలమూరు బిడ్డ అంటూ ప్రాజెక్టులపై నిరక్ష్యం
- బాబు మెప్పుకోసం చిట్టిబాబు తపన
- పాత రోజులు తెస్తామంటే ఏమిటో ఇప్పుడు అర్థమైంది..
- నాగర్‌కర్నూల్ జిల్లా సర్పంచుల ఆత్మీయ సన్మాన సభలో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్..

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, డిసెంబర్ 28 ప్రభాతవార్త:** ఉమ్మడి రాష్ట్రంలో మహబూబ్‌నగర్ జిల్లాను అప్పటి సీఎం చంద్రబాబు నాయుడు దత్తత తీసుకొని దగా చేస్తే, పాలమూరు జిల్లా బిడ్డను గెలిపిస్తే సీఎం అయి అభివృద్ధి చేస్తానని ప్రగల్భాలు పలికి పాలమూరు జిల్లాను గురు శిష్యులు భ్రష్టు పట్టించారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు పేర్కొన్నారు. పక్క రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు మెప్పు కోసం తెలంగాణ ముఖ్యమంత్రి చిట్టిబాబు తపన పడుతున్నారని అందుకే తెలంగాణకు లబ్ధి చేకూర్చే ప్రాజెక్టులను పట్టించుకోవడంలేదని అన్నారు. ఆదివారం నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయ ఆవరణలో మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లాలో నూతనంగా ఎన్నికైన సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యుల ఆత్మీయ సన్మాన కార్యక్రమానికి కేటీఆర్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. సర్పంచ్ ఎన్నికలలో తెలంగాణ ప్రజలు చూపిన ఆదరణ బీఆర్ఎస్ పార్టీలో ఎంతో ఉత్సాహాన్ని నింపింది అన్నారు. ఈరోజు నాగర్ కర్నూల్ సభకు వస్తున్న తనకు స్వాగతం పలకడానికి వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు వారిలో ఉన్న ఉత్సాహం మర్రి జనార్దన్ రెడ్డి సారథ్యంలో నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రాన్ని గులాబీమయం చేయడం చూస్తే కేసీఆర్ మళ్ళీ ముఖ్యమంత్రి అయ్యారా అన్నంత ఆనందం గా కనిపించిందన్నారు. ఇదే ఉత్సాహాన్ని ఐకమత్యాన్ని చాటుతూ రాబోయే ఎన్నికలలో బిఆర్ఎస్ పార్టీ విజయానికి కలిసికట్టుగా కృషి చేయాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. ఫిబ్రవరి నెలలో మున్సిపల్ ఎన్నికలు వచ్చే అవకాశాలు ఉన్నాయని ఇప్పటినుంచే క్షేత్రస్థాయిలో పనిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది అన్నారు. నాగర్ కర్నూలు జిల్లాలో సర్పంచ్ ఎన్నికలలో సగానికి పైగా స్థానాలలో తమ పార్టీ బలపరిచిన అభ్యర్థులు గెలుపొందడం జిల్లాలో నాయకులకు కార్యకర్తలకు పార్టీ పట్ల ఉన్న అంకితభావం చాటుతుందన్నారు. ఇదే స్ఫూర్తితో ముందుకు వెళ్లాలని ఆయన కోరారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పూర్తి అయితే పాలమూరు జిల్లాకు నీటి కష్టాలు తీరుతాయని కేసీఆర్ దృఢ సంకల్పంతో ప్రాజెక్టును 90 పూర్తి చేస్తే ఈ రెండేళ్లలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తట్టెడు మట్టి కూడా తీయలేదని తీవ్రస్థాయిలో ఆరోపించారు. 28 వేల కోట్లు కేటాయించి నిధులు కూడా ఇవ్వడం జరిగిందని 70 టీఎంసీల నీరు నిలువ ఉండే రిజర్వాయర్లను కూడా కేసీఆర్ హయంలోనే పూర్తి చేశారన్నారు. కేవలం 10 శాతం ఉన్న పనులకు రెండేళ్ల సమయం పడుతుందా అని ఆయన ప్రశ్నించారు. ఈ ప్రాజెక్టు పూర్తి అయితే కెసిఆర్ కు పేరు ప్రతిష్టలు వస్తాయని కుట్రతో పనులు చేయడం లేదని కేటీఆర్ ఆరోపించారు. తెలంగాణను పాలిస్తున్న ముఖ్యమంత్రి కి గుండెలు లేవని కేటీఆర్ అన్నారు. రాష్ట్ర ప్రజలకు ఎరువులు ఇవ్వాలన్న సంక్షేమ పథకాలు ఇవ్వాలన్న సోయి సీఎంకు లేదన్నారు. తెలంగాణ ప్రజలకు ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయకపోవడం ఆ అంశాన్ని ప్రతిపక్షాలు ప్రజలు నిలదీస్తే ముఖ్యమంత్రి అన్న సోయి కూడా మరిచి ఆరు గ్యారెంటీలను అడిగిన వారి పట్ల కళ్ళు పీకి గోటీలు ఆడుతా... లాగులో తొండలు ఇడుస్తా... కడుపులో పేగులు పీకి మెడలో వేసుకుంటా... అంటూ మాట్లాడడం సీఎం రేవంత్ రెడ్డి అసహనం చేతకానితనానికి నిదర్శనమని కేటీఆర్ దుయ్యబట్టారు. చేతకాని హామీలు ఇచ్చి హామీలను అమలు చేయలేక అడ్డగోలుగా మాట్లాడడం రేవంత్ రెడ్డికి వెన్నతో పెట్టిన విద్యగా మారిందని ఆయన ఆరోపించారు. కృష్ణానదిపై సాగునీటి ప్రాజెక్టులను నిర్మించకపోవడానికి ప్రధాన కారణం చంద్రబాబు నాయుడుతో రేవంత్ రెడ్డికి ఉన్న అనుబంధమే అని ఆయన ఆరోపించారు. ఐదేళ్లపాటు ఏపీకి నీటి కష్టాలు రాకుండా చూడడానికే ప్రాజెక్టుల పట్ల నిరక్ష్యం వహిస్తున్నట్లు స్పష్టం అవుతుందని ఆయన ఆరోపించారు. ఎన్నికలకు ముందు రేవంత్ రెడ్డి తెలంగాణలో పాత రోజులు తెస్తామంటే ఏమో అనుకున్నామని ఇప్పుడు పరిస్థితులను చూస్తే అర్థమవుతుందని కేటీఆర్ అన్నారు. ఎరువుల కోసం పడిగాపులు కాయడం విత్తనాల కోసం వేచి చూడడం బస్తా ఎరువులు కూడా అందంగా ప్రజలు పడుతున్న ఇబ్బందులు, విద్యా ఉపాధి ఇతర అంశాలు, లక్షల కోట్లు మింగడానికి చేస్తున్న కుట్రాలను చూస్తుంటే పాత రోజులే వచ్చినట్లు స్పష్టం అవుతుందని కేటీఆర్ ఆరోపించారు. ముఖ్యమంత్రిగా కేసీఆర్ హైదరాబాద్ నగరాన్ని ప్రపంచ పటంలో ఉంచి దేశంలోనే అభివృద్ధి చెందిన రాష్ట్రాల సరసన చేర్చగా దీనిని అదునుగా చూసి ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రియల్ ఎస్టేట్ వ్యాపారానికి తెరలేపి లక్షల కోట్లు కొల్లగొట్టడానికి శ్రీకారం చుట్టారని కేటీఆర్ ధ్వజమెత్తారు. పరిశ్రమల స్థాపన కోసం గత ప్రభుత్వం పారిశ్రామికవేత్తలకు భూములు కేటాయిస్తే ఆ భూములను అమ్ముకోవడానికి తెర లేపారని ఆరోపించారు. పరిశ్రమలకు కేటాయించిన భూములలో రియల్ ఎస్టేట్ వ్యాపారాలతో పాటు అపార్ట్మెంట్లను నిర్మించుకోవచ్చని అందుకు 30 శాతం చెల్లిస్తే సరిపోతుందని చెప్పడం తెలంగాణ ప్రజలను ద్రోహం చేయడమే అన్నారు. పరిశ్రమలకు భూములు కేటాయించడం అంటే ఒకపక్క అభివృద్ధి మరోపక్క తెలంగాణ బిడ్డలకు ఉపాధి అవకాశాల కోసమే అన్నది గుర్తుంచుకోవాలన్నారు. ఈ విధానం ద్వారా ఐదు లక్షల కోట్ల అక్రమార్జనకు శ్రీకారం చుట్టడమేనని దీనిని మానుకోకపోతే ప్రత్యక్ష ఉద్యమాలను చవిచూడాల్సి ఉంటుందని హెచ్చరించారు. రేవంత్ సర్కార్ అవినీతి అరాచకాలను అడ్డుకుంటున్న అందుకే కేసిఆర్ పై కోస్గి సభలో నోటికి వచ్చినట్లు మాట్లారని కేటీఆర్ అన్నారు. బిజెపి కాంగ్రెస్ దోస్తులు గా ఉంటూ కేసిఆర్ ను బీఆర్ఎస్ ను టార్గెట్ చేస్తున్నారని ఆరోపించారు. రేవంత్ రెడ్డి చేసే అవినీతిని ఎత్తిచూపడంలో బిజెపి ఎందుకు వెనకడుగు వేస్తుందని ప్రశ్నించారు. అధికారంలో ఉండి అవినీతికి బాటలు వేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ముఖ్యమంత్రి –మిగతా4లో..



ప్రసంగిస్తున్న కేటీఆర్





# విషాదం

**ఆడుకుంటూ వెళ్లి ఒకరు.. బెదిరించబోయి మరొకరు..** 4

**వేర్వేరు ఘనల్లో ఇద్దరు చిన్నారుల మృతి**

జడ్చర్ల లో విషాదం చోటు చేసుకుంది.. వేరు వేరు ప్రమాదాల్లో ఇద్దరు చిన్నారులు మృతి చెందారు. ఆడుకుంటూ వెళ్లి ట్రాక్టర్ కింద పడి బాలుడు మృతి చెందగా, గాలిపటం కొనివ్వలేదని చీర మెడకు వేసుకుని మరో బాలుడు ప్రాణాలు వదిలిన ఘటన చోటు చేసుకున్నాయి. మృతి చెందిన వారు పది ఏళ్లలోపే పిల్లలు కావడంతో కుటుంబాల్లో విషాదాన్ని నింపాయి.

- జడ్చర్ల, డిసెంబర్28,ప్రభాతవార్త

# చదువుతోనే భవిష్యత్తు

- కష్టపడి చదివి భవిష్యత్తును బంగారు బాటగా తీర్చిదిద్దుకోవాలి
- కలలు కని సాకారం చేసుకోవాలి
- మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలి
- రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య
- గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో సహపంక్తి భోజనం



ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యకు బొకే అందజేస్తున్న కలెక్టర్ విజయేంద్ర బోయి



పోలీస్ గౌరవ వందనం స్వీకరిస్తున్న బక్కి వెంకటయ్య, చిత్రంలో ఎస్పీ జానకీ ధరావత్

**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబరు 28 ప్రభాతవార్త :** చదువు జీవితాన్ని మార్చుతుందని విద్యార్థినిలు బాగా కష్ట పడి చదివి తమ భవిష్యత్‌కు బంగారు బాట వేసుకొని తల్లి దండ్రుల ఆశయం నెరవేర్చాలని రాష్ట్ర ఎస్‌సి.,ఎస్‌టి కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. ఆదివారం మహబూబ్ నగర్ జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన వేముల గ్రామంలో అత్యాచారానికి గురై మరణించిన దళిత యువతి కుటుంబాన్ని పరామర్శించి ఆర్అండ్‌బి అతిథి గృహంలో జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి,ఎస్.పి. డి.జానకిలతో కలిసి చర్చించారు.అనంతరం మహబూబ్ నగర్ తిరుమల హిల్స్ లోని గిరిజన సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలను సందర్శించారు.డిగ్రీ రెండవ,మూడవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులతో సమావేశమై వారితో మాట్లాడారు. బోధన,భోజనం,వసతులు,ఇతరత్రా ఏమైనా సమస్యలు ఉన్నాయా విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు.సమస్యలు ఏమి లేవని విద్యార్థిని లు చెప్పారు. రాష్ట్ర ఎస్. సి.,ఎస్.టి.కమిషన్ చైర్మన్ గా జిల్లాకు రావడం మూడవ సారి అన్నారు. రాష్ట్రం లోని అన్ని జిల్లాల్లో పర్యటించి సమస్యలు తెలుసుకుని ప్రభుత్వం దృష్టికి తీసుకు వచ్చి పరిష్కారం చేయనున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి సూచన మేరకు రాష్ట్రం లో ఎస్‌సి., ఎస్‌టి, మైనార్టీ, బిసి కళాశాలలు, గురుకులాలు సందర్శించి సమస్యలు తెలుసుకుని నివేదిక అంద చేసినట్లు,కాస్మొటిక్, మెస్ ఛార్జీలు పెంచి,మెనూ అమలు చేయాలని నివేదించిన పిదప ప్రభుత్వం క్యాబినెట్ సబ్ కమిటీ లో చర్చించి మెస్ ఛార్జీలు,కాస్మొటిక్ చార్జీలు పెంచి మెనూ అమలు చేయడం జరిగిందని అన్నారు. తరగతి గదుల్లోనే విద్యార్థిని లు భవిష్యత్ తీర్చిదిద్దడం జరుగుతుందని అన్నారు. ప్రశ్నించి నప్పుడే సమస్య పరిష్కారం అవుతుందని భారత రత్న అంబేద్కర్ అన్నారని, విద్యార్థిని లు తమ సమస్యలు అధికారుల దృష్టికి తీసుకు రావాలని అన్నారు. విద్యకు ఎంతో ప్రాముఖ్యత ఉందని, చదువుతోనే జీవితం,భవిష్యత్ అని విద్యార్థినిలు బాగా కష్టపడి చదివి తమ తల్లిదండ్రుల ఆశయం నిలబెట్టాలని అన్నారు.భారత మాజీ రాష్ట్రపతి దివంగత అబ్దుల్ కలాం చెప్పినట్లు కలలు కని సాకారం చేసుకోవాలని,తమ భవిష్యత్ ను తీర్చిదిద్దుకొని లక్ష్యాన్ని సాధించి ఉన్నత స్థానంలో నిలవాలని కోరారు. ప్రభుత్వ కళాశాలలు,వసతి గృహాల్లో చదివి ప్రభుత్వ అధికారులుగా ఉన్నత స్థానాల్లో –మిగతా4లో..

# రైతుల పట్ల నిరక్ష్య వైఖరి తగదు

- ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికల బహిష్కరణ అనేది గొప్ప నిరసన
- గోకారం ఎర్రవల్లి రిజర్వాయర్‌తో స్థానికులకు నష్టమే
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత



నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న కవిత

**నాగర్‌కర్నూల్ జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 28 ప్రభాతవార్త:**నల్గొండ జిల్లా ప్రయోజనాల కోసం ఇక్కడి ప్రజల భూములు ఊర్లు ముంచుతూ రిజర్వాయర్లు నిర్మించడం ఎంతవరకు సమంజసం అని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. గోకారం- ఎర్రవల్లి రిజర్వాయర్ కోసం ఎర్రవల్లి గ్రామస్తులు ఎన్నికలను బహిష్కరించడం ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికల బహిష్కరణ అనేది గొప్పనిరసన అని ఆమె పేర్కొన్నారు.ఉమ్మడిమహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పేరుతో ఇప్పటికే ఎంతో మంది రైతులు ఎంతో మంది తమ భూములు కోల్పోవడంతో పాటు ఎన్నోఊర్లు ముంపునకు గురయ్యాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.అచ్చంపేటనియోజకవర్గంలోని చారకొండ మండలం ఎర్రవల్లిలో ప్రజా వ్యతిరేక విధానాలతో నిర్మించ తలపెట్టిన గోకారం-ఎర్రవల్లి రిజర్వాయర్‌తో స్థానికులకు పూర్తిస్థాయిలో నష్టం వాటిల్లుతుందని ఆదివారం ఎర్రవల్లిలో స్థానికులు చేపట్టిన రిలేనిరాహారదీక్ష శిబిరాన్ని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సందర్శించి రైతులతో మాట్లాడారు. డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా గోకారం ఎర్రవల్లి రిజర్వాయర్‌లో గోకారంలో 900 ఎకరాలు, ఎర్రవల్లిలో 600ఎకరాల భూమిని,ఎర్రవల్లి గ్రామం , తండాను పూర్తిస్థాయిలో ముంపుకు గురవుతుందన్నారు. దాదాపు 1500కు పైగా ఎకరాల భూమి నష్టంతో పాటు ఎర్రవల్లి గ్రామం ,తాండ ముంపుకు గురైనప్పటికీ స్థానికంగా 2000 ఎకరాలకు మాత్రమే సాగునీరు అందించే అవకాశం ఉందన్నారు.కేవలం గోకారంగ్రామంలో దాదాపు 800 ఎకరాలచెరువును పునరుద్ధరించి,కాలువల ద్వారా నల్గొండజిల్లాకు నీటిని తరలించే అవకాశం ఉన్న, నిరక్ష్య ధోరణితో గ్రామాలను ముంపుకు గురి చేయడం ప్రభుత్వం పాలకుల మొండి వైఖరికి నిదర్శనం అన్నారు. వేలఎకరాల భూమి తండా గ్రామం ముంపుకు గురైనప్పటికీ స్థానికులకు భారీ మొత్తంలో ప్రయోజనం చేకూరితే స్వచ్ఛందంగా రిజర్వాయర్లు నిర్మించేందుకు రైతులే అంగీకరించే వారని, ఏమాత్రం ప్రయోజనం లేని రిజర్వాయర్ నిర్మాణానికి రైతులు ఎందుకు భూమిని, గ్రామాలను కోల్పోవాలని ప్రశ్నించారు. ఇంతవరకు జిల్లా కలెక్టర్, ప్రభుత్వ అధికారులు గానీ స్పందించి సమస్య పరిష్కారానికి కృషి చేయకపోవడం హేయమైన చర్య అని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు స్పందించి రిజర్వాయర్ సామర్థ్యాన్ని తగ్గించి, ఆర్ అండ్ ఆర్ నోటిఫికేషన్ రద్దు చేయాలన్నారు. శాంతియుతంగా చేస్తున్న ఎర్రవల్లి ప్రజల రిలే నిరాహార దీక్షకు సంపూర్ణ మద్దతును అందిస్తూ, తెలంగాణ జాగృతి తరుపున ఎర్రవల్లి ప్రజలకు అండగా ఉంటామన్నారు. సమస్యను తెలంగాణ మండలిలో చర్చించి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ నిరసన కార్యక్రమంలో కల్వకుర్తి జేఏసీ అధ్యక్షులు సదానందం గౌడ్, చంద్రాయన్‌పల్లి మాజీ ఎంపీటీసీ గోపిడి శ్రీనివాస్ రెడ్డి, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు పగడాల ఆంజనేయులు, రిలే నిరాహార దీక్ష నిర్వాహకులు ఏకుల ప్రకాష్, పర్వతాలు, శేఖర్, నాగయ్య, రాజు, లాలు, రామ్‌పాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు జాతీయ దినపత్రిక వార్త

విలేకరులు కావలెను

వనపర్తి జిల్లాలో విలేకరులుగా పనిచేసేందుకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నాము. ఆసక్తి గల అభ్యర్థులు తమ యొక్క బయోడేట సమర్పించగలరు.

ఈ క్రింది డేట్ లైన్‌లకు అభ్యర్థులు కావలెను

వనపర్తి జిల్లా :

- రేవల్లి, గోపాల్ పేట
- పెద్దమందడి,మదనాపురం
- కొత్తకోట,
- పానుగల్ , పెబ్బేరు

సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు :
9441615424, 9866340034

# నట్టల నివారణ మాత్రల కార్యక్రమం విజయవంతం

**ఉప్పునుంతల, డిసెంబరు 28 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, తెలంగాణ రాష్ట్ర పశు సంవర్ధక శాఖ వారి ఆధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా ఆదివారం స్థానిక పశు సంవర్ధక శాఖ ఉప్పునుంతల వారి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా మండలంలోని మర్రి పల్లి, ఉప్పరి పల్లి గ్రామాలలో గ్రామ సర్పంచులు సత్తుగోపాల్ రావు, బొజ్జ గీత అమరేందర్ రెడ్డిలు జీవాలకు నట్టల నివారణ మాత్రలు వేసి ప్రారంభించారు. ఆదివారం నిర్వహించిన గొర్రెలు, మేకలకు ఉచితంగా నిర్వహించిన నట్టల నివారణ మాత్రలు 2270జీవాలకు వేసినట్లు పశుసంవర్ధకశాఖ అధికారి ప్రవీణ్ కుమార్ వివరించారు. ఈశిబిరంలో ఆయా గ్రామాలసర్పంచ్‌లు సత్తుభూపాల్‌రావు, బొజ్జ గీతఅమరేందర్ రెడ్డి, ఉపసర్పంచులు కొండల్, రేసోజు శ్రీనివాసాచారి, ఆయాగ్రామాల వార్డు సభ్యులు, జెవిట శ్రీను, ఓస్ హాబీబ్, గోపాల మిత్రులు కొట్టే తిరుపతయ్య, శ్రీనుతో పాటు ఆయా గ్రామాల జీవాల పెంపకం దారులు పాల్గొన్నారు.


మర్రి పల్లిలో జీవాలకు నట్టల నివారణ మాత్రలు వేస్తున్న సర్పంచ్ సత్తు భూపాల్ రావు

# బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో ప్రకృతి వైద్య చికిత్స

**గద్వాల డిసెంబర్ 28, ప్రభాతవార్త:** గద్వాల పట్టణంలోని అమృత్ కుంజి పీస్ పార్క్ న్యూ హౌసింగ్ బోర్డ్ కాలనీలో గల బ్రహ్మకుమారి ఆధ్వర్యంలో ఆదివారం ప్రకృతి వైద్య చికిత్స శిబిరం గద్వాల సీఐ టంగుటూరి శ్రీను ప్రారంభించారు. బ్రహ్మకుమారీస్ రాజయోగ సేవా కేంద్రం ఆధ్వర్యంలో ప్రకృతి వైద్య చికిత్స అయిన మోకాళ్ళ నొప్పులు, నడుము, కీళ్ల నొప్పులు తింటి నొప్పి థైరాయిడ్ మేరికోసిన్ తదితర సమస్యలకు మందులు లేకుండా చికిత్సలు నిర్వహించారు. బ్రహ్మకుమారి సంస్థ నిర్వాహకురాలు మంజుల మాట్లాడుతూ ఆక్యు ప్రెషర్ సుజోకు క్రాపింగ్ వైబ్రేషన్ తెరపి తో అనేక వ్యాధులు మందులు లేకుండా చికిత్స చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా సీఐ శ్రీను మాట్లాడుతూ ప్రకృతి చికిత్స ద్వారా ఐదు రోజులలో ఏదో ఒక రోజు మందులు లేకుండా చికిత్స శిబిరాన్ని సందర్శించి వ్యాధులను నయం చేసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ అధ్యక్షులు అయ్యప్ప రెడ్డి, పరమేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సి ఐ టంగుటూరి శ్రీను

# సీసీ రోడ్డు పనుల ప్రారంభం

**మక్తల్ టౌన్, డిసెంబరు 28 ప్రభాతవార్త :** మక్తల్ మున్సిపాలిటీ పరిధిలోని నందిని నగర్ లో రాష్ట్ర మంత్రివర్యులు డా. వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు..రూ.10 లక్షల వ్యయంతో సి.సి రోడ్డు పనుల ప్రారంభోత్సవం లో అధికారులతో కలిసి కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి లో భాగంగా అవసరమైన అన్నిచోట్ల సిసి రోడ్లు వేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి లక్ష్మారెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ మండల అధ్యక్షులు గణేష్ కుమార్, కట్ట సురేష్ కుమార్ గుప్తా, టౌన్ ప్రెసిడెంట్ రవి కుమార్, కోళ్ల వెంకటేష్, కట్ట వెంకటేష్ , మందుల నరేందర్, కున్సీ నాగేందర్, బోయ వెంకటేష్, రాయికోడ్ ఆనంద్ , గొల్లపల్లి నారాయణ , సాయి ఫైనాన్స్ శీను ,అబ్దుల్ రెహమాన్, నూరుద్దీన్, కావలి తాయప్ప ,విష్ణు, ఉసాముద్దీన్ , రహీం పటేల్, పంచ మెకానిక్ రాము ,బాలచందర్, మిస్కిన్ నాగరాజ్ ,వడ్డే బాలరాజ్, గుంతలి శివకుమార్, వెంకటేష్, నాగేశ్వరరావు, చందాపురం రాములు, తిరుమలాపురం నరసింహ, మహేష్, నూరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.


సిసి రోడ్డు పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

# జిల్లాలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఒక్కటే

**సమావేశంలో మాట్లాడుతున్న డి సి సి చైర్మెన్ రాజీవ్ రెడ్డి**

**గద్వాల డిసెంబర్ 28, ప్రభాతవార్త:** జోగులాంబ గద్వాల జిల్లాలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఒక్కటే ఉంటుందని, డి సి సి కార్యాలయమే కాంగ్రెస్ పార్టీ కార్యాలయం అని, ఇంకెవరైనా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం అదికాదు ఇది అని చెప్పుకుంటే అధిష్ఠానం దగ్గరకు తీసుకెళ్తానని డి సి సి జిల్లా చైర్మెన్ రాజీవ్ రెడ్డి హెచ్చరించారు. ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకల అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో వెన్నుపోటు రాజకీయాలు చేస్తే సహించేది లేదని, తప్పుడు ప్రచారాలు చేయొద్దని, పాత కాంగ్రెస్, కొత్త కాంగ్రెస్ అనేది ఉండదనీ ఆయన అన్నారు. అందరికి ఒకటే కాంగ్రెస్ పార్టీ కార్యాలయం అని, బీఫామ్స్ ఇచ్చేది కాంగ్రెస్ పార్టీ దీదిది మాత్రమేనని, ఎవ్వరు ఇంట్లో వాళ్లు కూర్చొని రాజకీయాలు చేసుకుంటూ, కాంగ్రెస్ పార్టీనీ వాడుకొని వదిలేస్తాము అంటే ఊరుకునేది లేదని, పార్టీ గురించి తప్పుడు ప్రచారాలు చేస్తే అట్టివారిపై పార్టీ అధిష్ఠానానికి పిర్యాదు చేస్తానని తెలిపారు. అయిదవ తారీఖు నుంచి ప్రతి ఊర్లో పర్యటిస్తామని, ఎప్పుడూ, నిరంతరం మీ మధ్యలోనే ఉంటూ పార్టీ అభివృద్ధి కి కృషి చేస్తానని ,కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలందరిని ఆహ్వానిస్తున్నామని, కార్యకర్తలు అందరు కలిసికట్టుగా వచ్చి పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలన్నారు.


మాట్లాడుతున్న డి సి సి చైర్మెన్ రాజీవ్ రెడ్డి

# ఉచిత వైద్య శిబిరం విజయవంతం

**నారాయణ పేట, డిసెంబరు 28 ప్రభాతవార్త :** నారాయణ పేట జిల్లా ఉట్కూర్ గ్రామపంచాయతీ కార్యాలయం సమీపంలో పిఎస్ సునంద మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతంగా ముగిసింది. ఈ శిబిరాన్ని ఉట్కూర్‌తో పాటు పరిసర గ్రామాల నుంచి దాదాపు 350 మంది ప్రజలు సద్వినియోగం చేసుకున్నారు. ఈ శిబిరంలో ఉచిత వైద్యుల సలహాలు, రూ.3,500 విలువైన పిఎండి పరీక్షలు నిర్వహించడంతో పాటు అవసరమైన మందులను కూడా ఉచితంగా అందజేశారు. గ్రామాల్లో విద్యావంతుల సంఖ్య అధికంగా ఉండటంతో ప్రజలు వైద్యం పట్ల మంచి అవగాహన కలిగి ఉన్నారని ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ డా. ప్రసాద్ శెట్టి తెలిపారు. ఈ సందర్భంగా ఉట్కూర్ సర్పంచ్ రేణుక భరత్ మాట్లాడుతూ పిఎస్ సునంద మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఉచిత వైద్య శిబిరాల ద్వారా గ్రామీణ ప్రజలకు అందిస్తున్న సేవలు అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉట్కూర్ మాజీ ఎంపీపీ నారాయణరెడ్డి, ఉప సర్పంచ్ రమేష్, మాజీ సర్పంచ్ బాల్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు విగ్నేశ్వర్ రెడ్డి, గ్రామ కార్యదర్శి శ్రీనివాస్, లయన్స్ క్లబ్ సభ్యులు జనార్దన్ రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


ఉచిత వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

# గ్రామ అభివృద్ధి కోసమే కాంగ్రెస్ పార్టీలో చేరాను

**మొత్కులకుంట తాండ సర్పంచ్ గీతా కృష్ణ నాయక్**

**రాజాపూర్, డిసెంబరు 28 ప్రభాతవార్త :** మొత్కులకుంట తండా గ్రామపంచాయతీ అభివృద్ధి కోసమే కాంగ్రెస్ పార్టీలో చేరానని ఆ గ్రామ నూతన సర్పంచ్ గీతా కృష్ణ నాయక్ పేర్కొన్నారు. ఆదివారం ఈ మేరకు వార్త ప్రతినిధితో సర్పంచ్ మాట్లాడుతూ పది రోజుల్లోనే గ్రామంలో దాదాపు 30 లక్షల వ్యయంతో సిసి రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుధ్ రెడ్డిని తమ గ్రామ పంచాయతీకి తీసుకువచ్చి గ్రామంలో ఈ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నట్టు సర్పంచ్ గీతాకృష్ణ నాయక్ పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని పార్టీ మారానే తప్ప ఎలాంటి లాభాపేక్ష కోసం కాదని ఈ సందర్భంగా సర్పంచ్ గీతాకృష్ణ నాయక్ వెల్లడించారు.


కాంగ్రెస్ పార్టీలో చేరిన మొత్కులకుంట తండా సర్పంచ్ గీతా కృష్ణ నాయక్

# విద్య వెలుగులు నింపిన సూర్యుడు సుబ్బయ్య

**ఘనంగా పాలెం వైతాళికుడి శతజయంతి**

**తీపి జ్ఞాపకాలు గుర్తు చేసుకున్న పూర్వ విద్యార్థులు**

**బిజినేపల్లి, డిసెంబరు 28 ప్రభాతవార్త :** ఎందరో పేద విద్యార్థుల జీవితాల్లో విద్యా వెలుగులు నింపిన సూర్యుడు తోటపల్లి సుబ్రహ్మణ్య శర్మ (సుబ్బయ్య) అని ఆయన సేవలను పూర్వ విద్యార్థులు కొనియాడారు. పాలెం గ్రామంలో ఆదివారం తోటపల్లి సుబ్రహ్మణ్యం మెమోరియల్ హై స్కూల్ ఆవరణలో తోటపల్లి సుబ్బయ్య శతజయంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. తోటపల్లి సుబ్రహ్మణ్య శర్మ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. పాలెం వైతాళికుడిగా దశాబ్దాల క్రితమే ఆయన జీవిత ప్రయాణంలో పల్లెటూరు పాలెంలో పట్టణాలకు దీటుగా సౌకర్యాలు కల్పించి తన నిస్వార్థ సేవా సంకల్పానికి ప్రతిరూపంగా నిలిచారని కొనియాడారు. ఆ రోజుల్లో తిండికి ఇబ్బందికరమైన కాలంలోనే హాస్టల్ వసతి కల్పించి విద్యను అందింపజేసిన గొప్ప వ్యక్తి శక్తి సుబ్బయ్యని గుర్తు చేసుకున్నారు. పాలెం వెంకన్న జనంతో నడుస్తూ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి కోసం దివంగత సుబ్బయ్య రూపంలో ఈ నేలపై తిరిగాడారని ఆయన సేవలను చెప్పుకొచ్చారు. దశాబ్దాలనాడే పాలెం గ్రామ ప్రజలు అన్ని అభివృద్ధి పనులు అనుభవించడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుందని వ్యవసాయ కళాశాల డీన్ పుష్పవతి అన్నారు. పాలెం అంటే చదువు, చదువు అంటే పాలెం అన్న కీర్తి నాలుగు దిశల ఆనాడు వ్యాపించిందన్నారు. నేటి సమాజంలో తన కుటుంబం కోసం పరితపించే వ్యక్తులు ఉన్నారని, ఎలాంటి అవకాశాల కోసం ఎదురు చూడకుండా విద్య వైద్యం ఉపాధి సాంకేతిక రంగాల్లో తన గ్రామం అభివృద్ధి చెందాలన్న ఆదర్శప్రాయుడని కొనియాడారు. వ్యవసాయమే జీవనాధారంగా బతికిన ఆరోజుల్లో విద్యపై దృష్టి సారించి, రాష్ట్రంలోనే పౌల్ట్రీ పరిశ్రమను తన గ్రామానికి తెచ్చి బడుగు బలహీన వర్గాలను ప్రోత్సహించిన వ్యక్తి సుబ్బయ్య అని పతాంజలి యోగ సమితి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు పూర్వ విద్యార్థి వస్సరిశివుడు అన్నారు. ఆనాడు రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన ఏ కొత్త పథకాలైన తన ఊరికే కావాలని కోరుకున్న నిస్వార్థ వ్యక్తి తోటపల్లి అని కొనియాడారు. సుబ్బయ్య గారి ఆశయాలను కొనసాగించాలని గ్రామాభివృద్ధిని యజ్ఞంగా ముందుకు తీసుకుపోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పారు. పాలెం నేలపై సుబ్బయ్య విత్తిన విద్య విత్తనాలు మొలకెత్తి భావి భారత పౌరులుగా దారి చూపిన ధన్యజీవి పాలెం సుబ్బయ్యను, జ్ఞానులు నడయాడిన జ్ఞానభూమిని ఎన్నటికీ మరవబోమని పూర్వ విద్యార్థులు తమ జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. శతజయంతి సంబరాల్లో భాగంగా విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతి అందించారు. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్య ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. పూర్వ విద్యార్థి గోవర్ధన్ రచించిన పుస్తకాలను ఆవిష్కరించారు. పూర్వ విద్యార్థులు గురువులను సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామంలో సుబ్బయ్య చిత్రపటంతో శోభాయాత్ర నిర్వహించారు. సుబ్బయ్య కుమారుడు శ్రీనివాసులు గ్రామస్తులు సన్మానించి జ్ఞాపిక అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ బోనాసి రామకృష్ణ, మాజీ ఎంపీపీ శ్రీనివాస్ గౌడ్, మోహన్ బాబు, బాలకృష్ణయ్య, అనుపటి లక్ష్మీ మ్రకాంత్, జగపతిరావు, గాడి సురేందర్, గోపాలస్వామి, విష్ణుమూర్తి ,కృష్ణ గౌడ్, దేవేందర్, ఎంఈఓ రఘునందన్ శర్మ , మధుసూదన్, రవీందర్ రెడ్డి, శ్రీనివాసులు పలువురు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.


తోటపల్లి సుబ్బయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పూర్వ విద్యార్థులు



శతజయంతి సంబరాల్లో విద్యార్థుల కళా ప్రదర్శన

# క్రీడలకు కేసీఆర్ ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇచ్చింది

**ఓపెన్ టు ఆల్ కబడ్డీ టోర్నమెంట్ ప్రారంభంలో బాసు హనుమంతు నాయుడు**

**గద్వాల డిసెంబర్ 28, ప్రభాతవార్త:** క్రీడల్లో గెలుపోటములు సహజమని క్రీడాకారులు స్నేహపూర్వకంగా క్రీడల్లో పాల్గొనాలని నియోజకవర్గ బిఆర్ యస్ పార్టీ ఇంచార్జీ బాసు హనుమంతు నాయుడు అన్నారు. ఆదివారం గద్వాల నియోజకవర్గం గట్టు మండలం ఇందువాసి గ్రామంలో క్రిస్మస్, నూతన సంవత్సరం సందర్భంగా నిర్వహించిన ఓపెన్ టు ఆల్ కబడ్డీ టోర్నమెంట్ను రెండవ రోజు టాస్ వేసి,టోర్నమెంట్ను ప్రారంభించారు. అనంతరం, క్రీడాకారులతో కొదిసేపు కబడ్డీ ఆడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...క్రిస్మస్ , నూతన సంవత్సర సందర్భంగా ఇందువాసి గ్రామంలో కబడి టోర్నమెంట్ నిర్వహించడం చాలా సంతోషకరమని అన్నారు. క్రీడల్లో గెలిచినా ఓడినా సమానమే అని, ఓటమి అనేది విజయానికి నాంది అన్నారు. క్రీడలకు గత కేసీఆర్ ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇచ్చిందని గుర్తు చేశారు. ప్రతీ ఒక్కరూ స్నేహ బావాలను అలవర్చుకుంటూ క్రీడల్లో పాల్గొనాలన్నారు.ప్రతీ ఏటా ఇక్కడ క్రీడలను నిర్వహించడం చాలా గొప్ప విషయం అన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సుధీర్ గౌడ్,నూర్ పాషా,కిష్టప్ప,మద్దిలేటి,నిక్కీ జమన్న, యం. ఆంజనేయులు, నాయబై రమేష్, స్వాగల బస్వరాజు, ఆర్.ఇంజన్న, యం.నాగరాజు నాయుడు,సిరికి,ఇంజన్న,తిమ్మప్ప, రవి, హనుమంతు,సేదన్న, గ్రామ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న బాసు హనుమంతు నాయుడు

# ఉపాధి హామీ చట్టంలోని మార్పులను వెనక్కి తీసుకోవాలి

**మక్తల్‌టౌన్, డిసెంబరు 28 ప్రభాతవార్త :** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఉపాధి హామీ పథకంలో భాగంగా గాంధీ పేరును తొలగిస్తూ, రాష్ట్రాలపై ఆర్థిక భారాన్ని మోపడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రి వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు మక్తల్ పట్టణంలోని స్థానిక కన్యకా పరమేశ్వరి ఆలయం వద్ద ఉన్న గాంధీజీ విగ్రహం వద్ద కాంగ్రెస్ నాయకులు నిరసన తెలిపారు. స్వాతంత్రోద్యమంలో కీలక భూమిక పోషించిన గాంధీజీ పేరును ఉపాధి హామీ పథకంలో నుంచి తొలగించడం కేంద్ర నిరంకుశత్వానికి నిదర్శనమని, వెంటనే గాంధీజీ పేరును తిరిగి జోడించాలని, దీంతోపాటు రాష్ట్రాలపై మోపుతున్న ఆర్థిక భారాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి లక్ష్మారెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ మండల అధ్యక్షులు గణేష్ కుమార్, కట్ట సురేష్ కుమార్ గుప్తా, టౌన్ ప్రెసిడెంట్ రవి కుమార్, కోళ్ల వెంకటేష్, కట్ట వెంకటేష్ , మందుల నరేందర్, కున్సీ నాగేందర్, బోయ వెంకటేష్, రాయికోడ్ ఆనంద్, గొల్లపల్లి నారాయణ , సాయి ఫైనాన్స్ శీను ,అబ్దుల్ రెహమాన్, కావలి తాయప్ప, నూరుద్దీన్, విష్ణు, ఉసాముద్దీన్ , రహీం పటేల్, బోయ నరసింహ, మెకానిక్ రాము ,బాలచందర్, మిస్కిన్ నాగరాజ్ కొండయ్య, మొగులప్ప , సురేష్, గడుగు వెంకటేష్, నాగేశ్వరరావు, చందాపురం రాములు, మహేష్, నూరుద్దీన్, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**ఉప్పునుంతల, డిసెంబరు 28 ప్రభాతవార్త :** స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో 2005,06 సంవత్సరంలో చదువుకున్న విద్యార్థులు ఆదివారం కొత్త యశోద ఫంక్షన్ హాల్‌లో ఘనంగా ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. పూర్వ విద్యార్థులు చదువుకున్న సమయంలో వారు అనుభవించిన వాతావరణం, స్నేహభావం, తమకు అందించిన గురువులు, ప్రస్తుతం ఏ స్థాయిలో ఎదిగామని ఉద్దేశంతో ఒకరితో ఒకరు నెమరు వేసుకున్నారు. స్నేహభావంతో తమ గురువులు అందించిన క్రమశిక్షణతో తాము నిర్వహించుకున్న సమ్మేళనానికి హాజరైన గురువులను జలాభిషేకం చేస్తూ వారికి పాదాభివందనం చేశారు. అనంతరం గురువులను శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా అప్పటి పాఠశాల ఉపాధ్యాయులు హనుమంత్‌రెడ్డి, అచ్చంపేటమండల విద్యాధికారి జీవన్‌కుమార్, రవీందర్ రెడ్డి, రవిశంకర్, శేఖర్, శ్రీనివాసులు, విశ్రాంతి ఉపాధ్యాయులు దామోదర్‌రెడ్డి, జనార్థన్ రెడ్డి, కట్ట గోపాల్ రెడ్డి, కాశన్న, రమేష్ లు మార్గ దిశ నిర్దేశం చేశారు. పూర్వవిద్యార్థులు తమ విద్యాభ్యాస కాలంలో అనుభవాలు, గురువుల పాత్రను నెమరు వేసుకుంటూ వారికి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఈకార్యక్రమంలో దాచేపల్లి సాయిరాం గుప్తా, నాగరాజు, మహేష్ బాబు, శ్రీకాంత్ రెడ్డి, నరేష్, సాయిబాబు, శ్రీశైలం, తిరుపతి, వెంకటేష్, నిరంజన్, శీను, శేఖర్, తేజస్విని, చంద్రకళ, శివలీల, జయ, శ్రీవాణి, లలిత తదితరులు పాల్గొన్నారు.


పాఠశాలలో చదువుకున్న 2005,06 పూర్వ విద్యార్థులు

# ఆరు గ్యారంటీల అమలుపై బహిరంగ చర్చకు సిద్ధమా

**ఆత్మకూర్ డిసెంబర్ 28, ప్రభాతవార్త ;** రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలనగా చెప్పుకుంటూ గత శాసనసభ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరోగ్యానికి అమలుపై బహిరంగ చర్చకు సిద్ధమా అంటూ ఆత్మకూరు మండల పరిషత్ మాజీ అధ్యక్షులు బంగారు శ్రీనివాసులు, మండల పార్టీ అధ్యక్షులు గాయత్రి ,రవికుమార్ యాదవ్ తదితరులు తీవ్రస్థాయిలో భుజమెత్తారు. మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి 10 సంవత్సరాల పాలనలో ఉమ్మడి ఆత్మకూరు మండలానికి చేసిన అభివృద్ధి పనులపై, ప్రస్తుత శాసనసభ్యులు రాష్ట్ర పాడి పరిశ్రమ అభివృద్ధి శాఖ మంత్రివర్యులు వాకిటి శ్రీహరి చేసిన అభివృద్ధిపై బహిరంగ చర్చకు ఎక్కడికైనా తాము సిద్ధమేనని వారు సవాలు విసిరారు. ఆత్మకూరు మండల స్థాయి కాంగ్రెస్ నాయకులు ఇస్తారు. ఎత్తిగా మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే పై ఏక వచనంతో అవాకులు, చవాకులు పెరగడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నించారు. తమ ప్రభుత్వ హయాంలో ఆత్మకూర్ పరమేశ్వర స్వామి చెరువుని ఎల్లవేళలా నిండుకుండలా నింపిన ఘనత తమకే దక్కుతుందని అంతేకాకుండా ఉమ్మడి ఆత్మకూరు మండలంలో తాము చేసిన అభివృద్ధిని మరిచిపోయారా అంటూ వారు కాంగ్రెస్ నాయకులకు గుర్తు చేశారు. ఆత్మకూరు మండల కాంగ్రెస్ నాయకులు విలేకరుల సమావేశాలు ఏర్పాటు చేసి ఏమాత్రం అవగాహన లేకుండా మాటాడడం ఎంతవరకు సమంజసమని వారు అన్నారు. ప్రస్తుత శాసనసభ్యులు రాష్ట్ర మంత్రివర్యులు మక్తల్ నియోజకవర్గం అభివృద్ధి పథంలో కొనసాగించాలనుకుంటే తాము ఎల్లవేళలా సహకరించేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను ఏమాత్రం అమలు చేయకుండా ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా కలయాపన చేయడం కాంగ్రెస్ నాయకులకే చెల్లిందని వారు తీవ్రస్థాయిలో విమర్శించారు. ఇప్పటికే రైతు బంధు పథకాన్ని రెండుసార్లు ఎగ్గొట్టిన ఘనత ప్రజాపాలనగా చెప్పుకుంటున్న కాంగ్రెస్ పార్టీకే దక్కిందని ప్రతి సంవత్సరం రెండు పర్యాయాలు ఎకరాకు 5000 చొప్పున పెట్టుబడి సాయం అందించి రైతులను ఆదుకున్న ఘనత మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర రావుకే దక్కిందని వారు పేర్కొన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ నాయకులు అభివృద్ధిపై ఆలోచించి ఆత్మకూరు పట్టణాన్ని రెవెన్యూ డివిజన్ గా ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర మంత్రిపై ఒత్తిడి తీసుకురావాలని అందుకు తాము సంపూర్ణ సహకారం అందించేందుకు ఎల్లవేళలా సిద్ధంగా ఉన్నామని వారు విజ్ఞప్తి చేశారు. ఆదివారం రోజు ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టిఆర్ఎస్ నాయకులు మండల రామకృష్ణ, ఆత్మకూరు పట్టణ అధ్యక్షులు జానకి రాములు, రేచింతల సింగిల్ విండో మాజీ అధ్యక్షులు లక్ష్మీ మ్రకాంత్ రెడ్డి టిఆర్ఎస్ సీనియర్ నాయకులు కొత్త బోయ శేఖర్, శోభన్ బాబు, దండు శ్రీనివాసులు, మైనారిటీ నాయకులు ఆసీన్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు కానాపురం చెన్నయ్య తదితరులతో పాటుగా పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టిఆర్ఎస్ నాయకులు

# మన్‌కీ బాత్ వీక్షించిన బిజెపి నాయకులు


మన్ కీ బాత్ కార్యక్రమంలో బిజెపి నాయకులు

**జడ్చర్ల, డిసెంబరు 28 ప్రభాతవార్త :** భారతీయ జనతా పార్టీ జడ్చర్లమండల శాఖ మాచారం గ్రామంలో 129వ మన్‌కి బాత్ ఎపిసోడ్ మాచారం గ్రామ అధ్యక్షుడు తిరుపతి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల ఇంఛార్జి సామల నర్సింలు, మండల అధ్యక్షులు యాట రామకృష్ణ ముదిరాజ్, మండల ప్రధాన కార్యదర్శి ఎడ్ల శ్రీనివాస్ గౌడ్, మండల ఉపాధ్యక్షులు కాశన్న, మండల ఉపాధ్యక్షులు మహేష్ యాదవ్, మండల కోశాధికారి కనిక గౌరీశంకర్, తోకల కేశవులు, గోపులాపూర్, తిరుపతి, భాగ్యమ్మ, శివలీల, వినోద్, బిజెపి మాచారం 2 వార్డ్ నెంబర్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# రిటైర్డ్ ఆర్డీవో పాండు

## జ్ఞాపకార్థం అన్న ప్రసాద వితరణ



అన్నప్రసాద వితరణ చేస్తున్న దృశ్యం

**మక్తల్ టౌన్, డిసెంబరు 28 ప్రభాతవార్త :** మక్తల్ పట్టణానికి చెందిన రిటైర్డ్ ఆర్డీవో లయన్ పాండు జ్ఞాపకార్థం స్థానిక పడమటి ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఆదివారం లయన్స్ క్లబ్ మక్తల్ సహకారంతో కుటుంబ సభ్యులు అన్న ప్రసాద వితరణ చేపట్టారు. దాదాపు 500 మంది భక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా పాండు సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు అడ్వకేట్ దత్తాత్రేయ, హేమ సుందర్, శ్రీధర్, తుకారం, లయన్స్ క్లబ్ మక్తల్ అధ్యక్షుడు సత్య ఆంజనేయులు, ట్రెజరరీ ఆడెం సత్యనారాయణ, సీనియర్ సభ్యులు డాక్టర్ శ్రీరామ్, రమేష్ రావు, ఎ.రవి కుమార్, జాయింట్ సెక్రటరీ మామిళ్ళ పృథ్వీరాజ్, నాగరాజు, జయపాల్ రెడ్డి , అంబాదాస్, శరణప్ప, భాస్కర్ సార్, తదితరులు పాల్గొన్నారు.

# విశ్వశాంతి మహాయాగం

**వివరాలు తెలుసుకున్న రాజీవ్ రెడ్డి**

**గద్వాల డిసెంబర్ 28, ప్రభాతవార్త:** గద్వాల్ జిల్లా కేంద్రంలో ని 14 ఎకరాల స్థలంలో జరుగుతున్న 88 వ విశ్వశాంతి మ హాయాగ మహోత్సవ కార్యక్రమాలను డిసిసి చైర్మెన్ రాజీవ్ రెడ్డి, శ్రీ కృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామీజీనీ అడిగి తెలుసుకున్నారు. ఆదివారం ఆయన విశ్వశాంతి మహాయాగ స్థలం దగ్గరకు వెళ్లి ఏర్పాట్లను పరిశీలించారు. ఈనెల 27నుండి జనవరి 12వతేదీవరకు జరిగే శ్రీకృష్ణ కాలచక్రం మహాయాగం పనులను పరిశీలించి కార్యక్రమం వివరాలగురించి శ్రీకృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామీజీతో మాట్లాడారు. రాజీవ్‌రెడ్డితో పాటుగా కాంగ్రెస్‌పార్టీనాయకులు, అభిమానులు తదితరులు ఉన్నారు.


శ్రీకృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామీజీ నమస్కరిస్తున్న రాజీవ్ రెడ్డి

# మొక్కలకు నిప్పు పెట్టిన వారిపై చర్యలు తీసుకోండి

**మక్తల్ టౌన్, డిసెంబరు 28 ప్రభాతవార్త :** గొల్లపల్లి పంచాయతీ పరిధిలో రోడ్డుకి ఇరువైపులా ఉన్న మొక్కలకు నిప్పు పెట్టి మొక్కలను దహనం చేస్తున్నా అధికారులు పట్టించుకోవడంలేదని ప్రజలు వాపోతున్నారు. పంచాయతీ సెక్రటరీ నిందితులపై ఇప్పటివరకు ఎలాంటి ఫిర్యాదు చేయకపోవడం, తమ అధికార పరిధిలో ఉన్న చర్యలను తీసుకోవాలని గ్రామస్తులలో తీవ్ర చర్చ జరుగుతోంది. చెట్లను తగలబెట్టిన నిందితులను శిక్షి ంచి, మొక్కలపై కనీస అవగాహన కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



# ప్రమాదకరపు మలుపు ....

**సూచిక బోర్డు ఏర్పాటు చేయాలి**




ప్రమాదకరంగా తాటిపాముల రోడ్డు

**శ్రీరంగాపూర్, డిసెంబరు 28 ప్రభాతవార్త :** శ్రీరంగాపూర్ మండలంలోని తాటిపాముల గ్రామానికి వెళ్లే రహదారి ప్రమాదకరపు మలుపులతో ఉంది. తాటిపాముల, తాటిపాముల తాండ, మల్లయిపల్లి, మల్లయిపల్లి తాండ, చింతకుంట మొదలగు గ్రామాలకు వెళ్లే రహదారి ఇది. మలుపుల దగ్గర ప్రమాద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయకపోవడం వల్ల వాహనదారులు ఇబ్బందులకు గురై ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు మలుపుల దగ్గర సూచిక బోర్డులను ఏర్పాటు చేయడం వల్ల రాత్రి, ప్రగలు వేళల్లో ప్రమాదాలు జరగకుండా అరికట్టవచ్చని వాహ నదారులు, గ్రామ ప్రజలు అధికారులను కోరుతున్నారు.

# స్పోర్ట్స్ యూనివర్సిటీ ఎప్పుడు ప్రారంభిస్తారు

**సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ , పియులో ఉత్సాహంగా క్రికెట్ పోటీలు**

**మహబూబ్‌నగర్ టౌన్, డిసెంబరు 28 ప్రభాతవార్త :** పాలమూరు విశ్వవిద్యాలయంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. రెండో ఇన్నింగ్స్ ప్రారంభానికి ముఖ్యఅతిథిగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ జాన్ వెస్లీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జాన్ వెస్లీ

ప్రకటించిన క్రీడా యూనివర్సిటీని ఎప్పుడు ప్రారంభిస్తారని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రభుత్వం మాటలకే పరిమితం కాకుండా ఆచరణలో వేగం పెంచాలని అదేవిధంగా క్రీడాకారులను ప్రోత్సహించడానికి కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు క్రీడలకు ప్రత్యేక నిధులు కేటాయించాలని ముఖ్యంగా మహబూబ్‌నగర్ జిల్లా నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, క్రీడా మంత్రి వాకటి శ్రీహరి, పర్యాటక మంత్రి జూపల్లి కృష్ణారావులు పాలమూరు యూనివర్సిటీ ప్రగతి కోసం ప్రత్యేక నిధులు కేటాయించి యూనివర్సిటీ అభివృద్ధికి కృషి చేయాలని అదేవిధంగా విశ్వవిద్యాలయాలు వివక్షతలు లేకుండా విజ్ఞానానికి, పరిశోధనలు, ఉపాధినిచ్చే కేంద్రాలుగా ఉండాలంటే ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని వారు తెలిపారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకొని బ్యాటింగ్ చేస్తూ క్రీడాకారులను ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి, సిఐటియు నాయకులు కిల్లె గోపాల్ ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి భరత్, పీయూ అధ్యక్ష కార్యదర్శులు బత్తిని రాము, రాజేష్ యాదవ్, ఉపాధ్యక్షుడు శేఖర్ నాయకులు రాకేశ్, పవన్, దత్తు, సుధాకర్, విజయ, మనీషా, శ్రీను, దినకర్, హనుమంతు, పరమేశు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటిన నవోదయ విద్యార్థులు

**బిజినేపల్లి, డిసెంబరు 28 ప్రభాతవార్త :** జన విజ్ఞాన వేదిక తెలంగాణ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో ఈనెల 26, 27, 28 న కరీంనగర్ జిల్లా కేంద్రం పారామిత విద్యాసంస్థ నిర్వహించిన రాష్ట్రస్థాయి చెకుముకి వైజ్ఞానిక ప్రతిభ ప్రదర్శనలో వివిధ విభాగాలలో అత్యుత్తమ ప్రతిభను ప్రదర్శించి వట్టెం జవహర్ నవోదయ విద్యాలయ విద్యార్థులు రాష్ట్రస్థాయి



రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచిన నవోదయ విద్యార్థులు

లో ద్వితీయస్థానాన్ని పొందారు. నవోదయ విద్యాలయానికి చెందిన రీటాజాస్మిన్ పదవ తరగతి, హరిప్రియ 9వ, లేపాక్షిరాజ్ 8వతరగతిలు ఇటీవల జనవిజ్ఞాన వేదిక మండలస్థాయి చెకుముకి పోటీలో జిల్లాస్థాయిపోటీల్లో ఈ విద్యార్థులు ప్రథమ స్థానం సాధించి రాష్ట్రస్థాయిలో పాల్గొన్నారు. అక్కడ వివిధస్థాయిలలో వివిధ విభాగాలలో నిర్వహించినటువంటి ప్రతిభా పాటవ పరీక్షలలో మంచి ప్రతిభను చూపించినందుకు ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలల విభాగంలో వట్టెం నవోదయ విద్యాలయం ద్వితీయ స్థానాన్ని సంపాదించుకుంది. ఈసందర్భంగా జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ముఖ్య అతిథులు నవోదయ విద్యాలయానికి ఒక సైన్స్ కిట్టు, మైక్రోస్కోప్‌ను విద్యార్థులకు జ్ఞాపికలను, ప్రశంసా పత్రాలను అందజేశారు. రాష్ట్రస్థాయిలో గుర్తింపును పొందేందుకు అత్యుత్తమ ప్రతిభను ప్రదర్శించిన విద్యార్థులను వట్టెం జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది అభినందించారు.

# నేడు డిసిసి కార్యాలయంలో కీలక సమావేశం

**నారాయణ పేట, డిసెంబరు 28 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా కేంద్రంలోని జిల్లా కాంగ్రెస్ కమిటీ డిసిసి కార్యాలయంలో డిసిసి నూతన కార్యవర్గం ఏర్పాటు-సూచనలపై కీలక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం నారాయణపేట జిల్లా డిసిసి అధ్యక్షులు కె. ప్రశాంత్ కుమార్ రెడ్డి నేతృత్వంలో జరిగింది. ఈ సందర్భంగా పార్టీ బలోపే



మాట్లాడుతున్న కాంగ్రెస్ ముఖ్య నాయకులు

తం, సంస్థాగత నిర్మా ణం, రానున్న రాజకీయ కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు. ముఖ్య అతిథులుగా టిపిసిసి జనరల్ సెక్రటరీ, మహబూబ్‌నగర్ పార్లమెంట్ ఇంచార్జ్ వేణు గౌడ్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ విజయ్ కుమార్, యువజన కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర జనరల్ సెక్రటరీ శివంత్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ సదాశివ రెడ్డి హాజరయ్యారు. సమావేశంలో బూత్ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు సంస్థాగత నిర్మాణాన్ని బలోపేతం చేయడం, యువజన కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్ పాత్రను పెంచడం, రానున్న ఎన్నికలకు వ్యూహాత్మక ప్రణాళిక రూపొందించడం, పార్టీ కార్యకర్తల మధ్య ఐక్యత, సమన్వయం పెంపొందించడం, ప్రజా సమస్యలపై ఉద్యమాలకు కార్యాచరణ చేపట్టడం, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రచారం, సోషల్ మీడియా ద్వారా పార్టీ కార్యక్రమాల విస్తృత ప్రచారం అంశాలపై దృష్టి సారించారు. ఈ సమావేశంలో జిల్లాలోని బ్లాక్ అధ్యక్షులు, అన్ని మండలాలు, టౌన్ అధ్యక్షులు, యువజన కాంగ్రెస్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రేపు హాకీ జట్టు ఎంపిక

**యూనివర్సిటీ ఫిజికల్ డైరెక్టర్ వై. శ్రీనివాసులు**

**మహబూబ్‌నగర్ టౌన్, డిసెంబరు 28 ప్రభాతవార్త :** అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్ నిర్వహించే సౌత్ జోన్, ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్లో భాగంగా పాలమూరు యూనివర్సిటీ హాకీ పురుషుల విభాగంలో ఎంపికలు ఉంటాయని యూనివర్సిటీ ఫిజికల్ డైరెక్టర్ వై. శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపికలు రేపు (డిసెంబర్ 30న) వనపర్తి లోని జూనియర్ కాలేజ్ గ్రౌండ్ లో ఉదయం 9 గం.లకు జరిగే సెలెక్షన్‌లో పాల్గొనాలని పాలమూరు యూనివర్సిటీ లోని అన్ని డిగ్రీ, పీజీ కాలేజీ విద్యార్థులు పాల్గొనవచ్చని వారు తమ తమ కళాశాల యొక్క బోనఫైడ్‌ను ఆ కళాశాల ప్రిన్సిపల్ సంతకంతో ఉన్నటువంటి సర్టిఫికెట్ తో హాజరు కావాలని అలాగే వారి వయసు 17 నుంచి 25 సంవత్సరాల మధ్యలో ఉండాలని పేర్కొన్నారు. ఇందులో ఎంపికైన క్రీడాకారులు జనవరి 13 నుంచి 16 వరకు 2026 లో జరిగే సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్ సత్యభామ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ చెన్నై తమిళనాడులో జరిగే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ పోటీలకు ముఖ్య అతిథులుగా పాలమూరు యూనివర్సిటీ ఉపకులపతి ప్రొ॥ జిఎన్ శ్రీనివాస్, రిజిస్ట్రర్ ప్రొ॥ పూస రమేష్ బాబు హాజరవుతున్నట్లు యూనివర్సిటీ ఫిజికల్ డైరెక్టర్ డా. వై. శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు.

# రెపరెపలాడిన కాంగ్రెస్ జెండా

## గద్వాల్ జిల్లా డిసిసి కార్యాలయంలో ఘనంగా కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

గద్వాల డిసెంబర్ 28, ప్రభాతవార్త: జోగుళాంబ గద్వాల జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ 140వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాజీవ్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అందరి మధ్య జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా రాజీవ్ రెడ్డి మాట్లాడుతూ. భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ 1885 డిసెంబర్ 28న ఆవిర్భవించి నేటికీ 140 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా ప్రతి కాంగ్రెస్ కార్యకర్తకు శుభాకాంక్షలు తెలియజేశారు. దేశానికి స్వాతంత్రం తీసుకొచ్చిన పార్టీ కాంగ్రెస్ పార్టీ అని, ఆనాటి నుండి దేశ సమగ్రతను కాపాడుతుంది కాంగ్రెస్ పార్టీ అన్నారు. ప్రపంచ దేశాల ముందు శక్తివంతమైన దేశంగా భారత్‌ను నిలబెట్టిన ఘనత కాంగ్రెస్ పార్టీ కే దక్కుతుంది అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఇన్చార్జి వెంకటేష్ ముదిరాజ్ ,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, నాగేంద్రయాదవ్, జిల్లా ,మండల ,గ్రామ నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

### ఘనంగా ఆవిర్భావ దినోత్సవం

**ఉప్పునుంతల, డిసెంబరు 28 ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీ 141 వ ఆవిర్భావ దినోత్సవం ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రమైన ఉప్పునుంతలలో గ్రామ సర్పంచ్ చింత గాళ్ళ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఆవిర్భావ దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. అచ్చంపేట ఉప్పునుంతల మార్గంలో ఉన్న బీసీ కాలనీ (తూర్పు) లో ఉన్న కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించి సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ చింత గాళ్ళ శ్రీనివాసులుతో పాటు మండల యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మెడమోని భాస్కర్, బీసీ సెల్ మండల అధ్యక్షులు మడ్డి తిరుపతయ్య గౌడ్, పార్టీ నాయకులు పాత్కుల రామచంద్రయ్య, ఐఎన్ టి యుసి మండల నాయకులు మేకల



ఆవిర్భావ వేడుకలు జరుపుకుంటున్న కాంగ్రెస్ నాయకులు

రామచంద్రయ్య, పార్టీ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### కాంగ్రెస్ పాలనలోనే పేదలకు సంక్షేమ పథకాలు

**ఆత్మకూర్ డిసెంబర్ 28, ప్రభాతవార్త;** దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పాలనలోనే పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఆత్మకూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ రహమతుల్లా, మక్తల్ నియోజకవర్గం యువజన కాంగ్రెస్ అధ్యక్షులు తులసిరాజు యాదవ్ తదితరులు అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆవిర్భవించి 141 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలోని ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించిన అనంతరం 141 వ పార్టీ ఆవిర్భావ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్రం సిద్ధించిన నాటి నుండి ఇందిరా గాంధీ హయాంలోనే బ్యాంకులను జాతీయం చేసి పేద ప్రజలకు సంక్షేమ పథకాలతో పాటుగా బడుగు బలహీన వర్గాల వారికి కూడు, గూడు అందించిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని వారు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో సైతం దివంగత నాయకులు వైయస్ రాజశేఖర్ రెడ్డి పాలన, ప్రస్తుత ప్రజాపాలన విజయవంతంగా కొనసాగిస్తున్న రేవంత్ రెడ్డి పాలనలోని పేద ప్రజలకు సంక్షేమ పథకాలు విరివిగా అందుతున్నాయని వారు పేర్కొన్నారు. దేశంలో మతచిచ్చురేపి విభజనకు పాల్పడుతున్న నరేంద్ర మోడీ ప్రభుత్వాన్ని గద్దె



జెండా ఆవిష్కరణ అనంతరం మాట్లాడుతున్న డిసిసి చైర్మెన్ రాజీవ్ రెడ్డి



ఉప్పునుంతల లో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న సర్పంచ్ చింత గాళ్ళ శ్రీనివాసులు

దించేందుకు కాంగ్రెస్ పార్టీకి రాజకీయాలకతీతంగా సంపూర్ణ సహకార అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పరమేష్, పట్టణ పార్టీ అధ్యక్షులు నల్లగొండ శ్రీనివాసులు, కాంగ్రెస్ పార్టీ వనపర్తి జిల్లా ఉపాధ్యక్షులు మొగిలి గంగాధర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దామోదర్, గాలి పంపు శ్రీనివాసులు, గడ్డమీది అశోక్, మహేష్, రఫిక్, నాగేష్, వడ్డేమాన్యం, మణి వర్ధన్ రెడ్డి తదితరులతో పాటుగా పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనమైన చరిత్ర కాంగ్రెస్ పార్టీది

## 140 ఏళ్ల చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీ బడుగు బలహీన వర్గాల కోసం ఎన్నో ఆవిష్కరణలు తెచ్చారు

## కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి

**వనపర్తి, డిసెంబరు 28 ప్రభాతవార్త :** ప్రపంచంలోనే 140 ఏళ్ల చరిత్ర కలిగి ఆవిర్భవించిన పార్టీ ఏదైనా ఉంది అంటే అది కాంగ్రెస్ పార్టీని అని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి అన్నారు. ఆదివారం వనపర్తి జిల్లా నూతన కార్యాలయం వద్ద కాంగ్రెస్ పార్టీ 140 వ ఆవిర్భావ వేడుకలను కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు శివసేన రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా పార్టీ జెండాను ఎగరవేశారు. కాంగ్రెస్ నాయకులకు కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి మాట్లాడుతూ బ్రిటిష్ సామ్రాజ్యంలో వారి అరాచకాలకు, హింసకాండల నుంచి ప్రజలకు విముక్తి కలిగించాలన్న గొప్ప సంకల్పంతో 1885 డిసెంబర్ 28 రోజున కాంగ్రెస్ పార్టీని మహానుభావులు ఆవిర్భవించారని గుర్తు చేశారు. పార్టీ ఆవిర్భవ సమయానికి 30 కోట్ల ప్రజలున్నప్పటికీ పూర్వం రోజుల్లో తినడానికి కూడా తిండి లేని పరిస్థితిలో దాపురించిన రోజుల్లో ఎన్నో సంస్కరణలు చేసి బడుగు, బలహీన వర్గాల కోసం కాంగ్రెస్ పార్టీ పని చేసిందని గుర్తు చేశారు. నెహ్రూ, మహాత్మా గాంధీ, ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ నేతృత్వంలో పేద దేశంగా పిలవబడే భరతావని గొప్ప దేశంగా పిలువబడుతుందంటే దానికి కారణం ఆనాటి ప్రధాన మంత్రులేనన్నారు. హెయిర్ పిన్ నుంచి ఏరోప్లేన్ వరకు



కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ వేడుకల్లో పాల్గొని కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న స్పోర్ట్స్ అథారిటీ చైర్మెన్ శివసేన రెడ్డి

భారతదేశం ఎదిగిందంటే దానికి కారణం కాంగ్రెస్ పార్టీ చేసిన కృషి అన్నారు. ప్రస్తుతం 140 కోట్ల ప్రజలు సుభిక్షంగా ఉన్నారంటే కాంగ్రెస్ పార్టీ ఘనతన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సెక్రటరీ నందిమల్ల యాదయ్య, పిసిసి కమిటీ సభ్యులు డెలిగేట్ శంకర్ ప్రసాద్, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు ధనలక్ష్మి ృ, జిల్లా కాంగ్రెస్ మీడియా కన్వీనర్ నందిమల్ల చంద్రమౌళి, కాంగ్రెస్ పార్టీ నాయకులు కదిరే రాములు, మాజీ కౌన్సిలర్ బ్రహ్మచారీ, కాంగ్రెస్ నాయకులు కోళ్ల వెంకటేష్, మధు గౌడ్, ఎండి బాబా, గణేష్ గౌడ్, ఎన్ఎస్‌యుఐ నాయకులు, ఐఎన్‌టియుసి నాగరాజు, వివిధ మండలాల అధ్యక్షులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గెలిచిన సర్పంచులకు సన్మానించిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే కెటిఆర్

**లింగాల, డిసెంబరు 28 ప్రభాతవార్త:** స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసి గెలుపొందిన సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులను ఆదివారం నాగర్ కర్నూలులో మాజీమంత్రి, ఎమ్మెల్యే కె.తారకరామరావు శాలువాతో ఘనంగా సత్కరించారు. నాగర్ కర్నూల్ జిల్లాలో కొల్లాపూర్, అచ్చంపేట, కల్వకుర్తి నియోజకవర్గంలోని వివిధ గ్రామపంచాయతీలో బిఆర్ఎస్ పార్టీ మద్దతుతో బిఆర్ఎస్ జెండాఎగరవేసిన సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులను కెటిఆర్ స్వయంగా శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. లింగాలమండలంలోని అంబట్‌పల్లి సర్పంచ్ జంబుల శ్రీవాణి, ఆనంద్‌రెడ్డి, ఉపసర్పంచ్ మల్లేష్, రాయవరం సర్పంచ్ పబ్బతి శ్రీను యాదవ్, క్యాంపు రాయవరం సర్పంచ్ బొల్లు నరేష్, ధారారం సర్పంచ్ లావుడ్య శ్రీనివాసులు, లింగాల ఉపసర్పంచ్ వీరాస్వామి తదితర గ్రామాల సర్పంచులను, ఉపసర్పంచులను, వార్డు సభ్యులను శాలువాతో సత్కరించారు. పోటీ చేసి ఓడిపోయిన సర్పంచులు అధైర్యపడవద్దని సూచించారు.



అంబట్ పల్లి సర్పంచ్ జంబుల శ్రీవాణి, ఆనంద్ రెడ్డిని శాలువాతో సత్కరిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే కెటిఆర్

# యువత అలుపెరుగని సాధనం వైపు దూసుకెళ్లాలి

## క్రీడల్లో గెలుపు,ఓటములను సమానంగా స్వీకరించాలి

## కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి

**వనపర్తి, డిసెంబరు 28 ప్రభాతవార్త :** యువత తమలో దాగిన ఉన్న కళను ప్రదర్శించి జాతీయ స్థాయిలో ప్రత్యేకంగా రాణించాలని , అలాగే క్రీడల్లో గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలని రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు శివసేన రెడ్డి అన్నారు. ఆదివారం వనపర్తి ప్రీమియం లీగ్ సీజన్ 6 ఆధ్వర్యంలో స్థానిక పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో ఈనెల 23 నుంచి 28 వరకు జరిగిన క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నారు. నిర్వాహకుల పిలుపు మేరకు ముగింపు సమయంలో ఉన్న ఫైనల్ మ్యాచ్‌లో పాల్గొన్న క్రీడాకారులకు కరచలనం చేస్తూ వారితో ముచ్చటించారు. ఫైనల్ మ్యాచ్లో తలబడుతున్న వనపర్తి వారియర్స్, అంజి లెవెన్ జట్లను ఉద్దేశించి మాట్లాడారు. యువత లక్ష్యాన్ని నిర్దేశించుకుని అలుపెరుగకుండా సాధన వైపు దూసుకెళ్లాలని సూచించారు. క్రికెట్ టోర్నమెంట్ ప్రదర్శన జరుగుతుండగా క్రికెట్ తిలకిస్తున్న ట్రైబల్ వెల్ఫేర్ విద్యార్థినిలు



స్టేడియంలో క్రికెట్ ఆడుతున్న శివసేనరెడ్డి

శివసేన రెడ్డిని కలిశారు. వారి పాఠశాలలో కావలసిన క్రీడ సదుపాయాలను ఏర్పాటు చేయాలని కోరడంతో వెంటనే స్పందిస్తూ క్రీడల అధికారి సుధీర్ రెడ్డి చరవాణిలో మాట్లాడి వారికి కావాల్సిన సదుపాయాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్ , కాంగ్రెస్ పార్టీ జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ నందిమల్ల చంద్రమౌళి, మాజీ కౌన్సిలర్ బ్రహ్మచారీ, కాంగ్రెస్ నాయకులు కోళ్ల వెంకటేష్, మధు గౌడ్, యాది, వనపర్తి ప్రీమియం లీగ్ నిర్వాహకులు మధు, సాయి, హరి, పలువురు పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న స్పోర్ట్స్ అథారిటీ చైర్మెన్



క్రీడాకారులను అభినందిస్తున్న శివసేనారెడ్డి

# కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరించిన జెడ్పి మాజీ చైర్ పర్సన్

## గద్వాల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి సరిత

**గద్వాల డిసెంబర్ 28, ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ 141వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మాజీ జెడ్పీ చైర్మన్, గద్వాల నియోజక వర్గ ఇంచార్జ్ సరిత తిరుపతయ్య తన స్వగృహంలో జెండా ను ఆవిష్కరించి కాంగ్రెస్ కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పార్టీ కార్యాలయం నుండి గద్వాల పట్టణ రహదారులపై బైక్ ర్యాలీ లో నిర్వహించారు. గద్వాల పట్టణం లోని మహాత్మా గాంధీ, ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ , బి ఆర్ అంబేద్కర్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులు అర్పించరు. అనంతరం సరితమ్మ మాట్లాడుతు...తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ రైతు భరోసా, మహిళల సంక్షేమం, పేదల నివాసం, సామాజిక భద్రతా పథకాల ద్వారా ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడమే లక్ష్యంగా పనిచేస్తోందని తెలిపారు. పాలనలో పారదర్శకత, బాధ్యతతో పాటు ప్రజలతో నేరుగా మమేకమై సమస్యలను పరిష్కరించే విధానాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తోందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే రాజకీయాల లక్ష్యమని, అధికారానికి కాదు ప్రజల సేవకే కాంగ్రెస్ పార్టీ అంకితమై ఉందని స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలంటే నాయకులు, కార్యకర్తలు ప్రతి గ్రామం లో ప్రజల మధ్య ఉండి పార్టీ విధానాలను వివరించాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే 141వ ఆవిర్భావ దినోత్సవానికి నిజమైన నివాళి అవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణం అధ్యక్షుడు తిరుమల్, నాయకులు పూడూరు అచ్చన్న గౌడ్, మధుసూదన్ బాబు, డి టీ డీ సి నరసింహులు, మాల శ్రీనివాసులు, మహబూబ్, భాస్కర్ యాదవ్, పెద్దపల్లి రాజశేఖర్ రెడ్డి, గొనుపాడు శ్రీనివాస్ గౌడ్, జమ్మిచేడు నాగరాజు, సురేష్, ఆనంద్, పట్టణ అధ్యక్షుడు, తాజా మాజీ కౌన్సిలర్లు, యువజన కాంగ్రెస్ నాయకులు, మండల అధ్యక్షులు, నూతన సర్పంచులు,



జెండా ఆవిష్కరన కార్యక్రమంలో సరితమ్మ, నాయకులు

సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అనుమతి లేని రైసు మిల్లుకు ధాన్యం తరలింపు

### ధాన్యం తరలించేందుకు రెండు లారీలు ,ఒక డీసీఎం వినియోగం

**వనపర్తి ప్రతినిధి, డిసెంబరు 28 ప్రభాతవార్త :** అనుమతి లేని రైసు మిల్లుకు కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యాన్ని తరలించిన ఘటన వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం కంచిరావుపల్లి గ్రామ శివారు లోని మారుతి ఆగ్రో ఇండస్ట్రీస్‌లో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. కంచిరావుపల్లి గ్రామంలోని ఓ రైసు మిల్లు వెనకాల గల పీఏసీఎస్ ఆధ్వర్యంలోని ధాన్యం కొనుగోలు


మారుతి ఆగ్రో ఇండస్ట్రీస్ లో ధాన్యం లారీలు

కేంద్రంలో రైతుల వద్ద నుంచి కొన్న ధాన్యాన్ని వనపర్తి డీఎస్ఓ, గ్రామ ప్రజాప్రతినిధులతో కలిసి రైసు మిల్లు యజమాని శ్రీనివాసులు తాను కొత్తగా ప్రారంభించిన పర్మిషన్ లేని తన రైసు మిల్లుకు ధాన్యం బస్తాలను తరలించి నిల్వ చేసుకున్నారు. రైసు మిల్లు యజమాని శ్రీనివాసులు శెట్టి మాట్లాడుతూ రైతుల నుంచి కొనుగోలు చేశానని, ధాన్యం అయిపోవస్తుందని మిల్లు నిర్మాణానికి బ్యాంకు నుంచి తీసుకున్న రుణానికి ఈఎంఐ కట్టడానికే ధాన్యం మిల్లుకు తెచ్చుకున్నట్లు తెలిపారు. రెండు లేదా మూడ్రోజుల్లో పర్మిషన్ వస్తుందని ఆ ధైర్యంతోనే వడ్లను దిగుమతి చేసుకున్నట్లు ఆయన తెలిపారు. ఇక ఈ విషయమై డీఎస్ఓ కాశీ విశ్వనాథ్‌ను వివరణ అడిగేందుకు ఫోన్ చేయగా అందుబాటులోకి రాలేదు. ఇదిలా ఉంటే ధాన్యం తరలించేందుకు వినియోగించిన 2 లారీలు, ఒక డీసీఎంలకు ట్రక్ షీట్లు ఉన్నట్లు తెలిసింది. గ్రామ ప్రజాప్రతినిధులు, డీఎస్ఓ అండతో పర్మిషన్ లేని రైసుమిల్లులో సీఎంఆర్ ధాన్యం స్టాక్ చేస్తున్నట్లు సమాచారం.

# చదువుతోనే భవిష్యత్తు

(మొదటి పేజీ తరువాయి)
ఉన్నతఅధికారులను ఉదాహరణగా పేర్కొన్నారు. చాకలి ఐలమ్మ,ఝాన్సీ లక్ష్మీ ్మ బాయి, ఇందిరా గాంధీ, సావిత్రి బాయి పూలే లాంటి మహిళలను స్ఫూర్తిగా తీసుకోవాలని అన్నారు. తొలుత కళాశాల ప్రిన్సిపాల్ వాసంతి పిళ్ళై మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థినిల సర్వతోముఖాభివృద్ధికి చదువుతో పాటు క్రీడలు, ఇతర కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు, గత సంవత్సరం 98 శాతం ఫలితాలు సాధించినట్లు తెలిపారు. వృత్తి నైపుణ్య, బ్యాంకింగ్,కానిస్టేబుల్ తదితర పోస్టులకు శిక్షణ నిస్తున్నట్లు తెలిపారు.

**విద్యార్థినిలతో కలిసి భోజనం...**
సమావేశం తర్వాత విద్యార్థిని లతో కలిసి రాష్ట్ర ఎస్‌సి.,ఎస్‌టి కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, అధికారులు భోజనం చేశారు. కార్యక్రమంలో ఆర్‌డిఓ నవీన్, డిఎస్‌పి వెంకటేశ్వర్లు, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కె.జనార్దన్, సహాయ సాంఘిక సంక్షేమ శాఖ అధికారి సుదర్శన్, ఆర్‌సిఓ కళ్యాణి, డిపిఆర్ఓ శ్రీనివాస్, గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ వాసంతి పిళ్ళై, తహశీల్దార్ ఘన్సీరాం, విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ చైర్మన్ బక్కి వెంకటయ్య,అధికారులను శాలువాతో సత్కరించారు.

# దత్తత పేరుతో గురుశిష్యుల దగా..

(మొదటి పేజీ తరువాయి)
రేవంత్ రెడ్డిని వదిలిపెట్టి బిఆర్ఎస్ ను బిజెపి టార్గెట్ చేయడం బట్టి చూస్తే రెండు పార్టీలు ఒక్కటే అని స్పష్టం అవుతుందన్నారు.


ప్రజలకు అభివాదం చేస్తున్న కేటీఆర్ చిత్రంలో మర్రి

**సర్పంచులకు సన్మానం..**
నాగర్ కర్నూల్ జిల్లాలో గెలుపొందిన సర్పంచులను కేటీఆర్ శాలువలు పూలమాలలతో ఘనంగా సన్మానించారు. గ్రామాభివృద్ధి కోసం నిబద్ధతతో పనిచేసే ప్రజల మనసును గెలుచుకోవాలని సూచించారు. కేంద్రం నుంచి వచ్చే నిధులు నేరుగా గ్రామపంచాయతీ ఖాతాలలో జమా అవుతా యని అందులో రాష్ట్ర ప్రభుత్వాల ప్రమేయం ఉండదన్నది ప్రతి సర్పంచ్ ఉప సర్పంచ్ గుర్తించు కోవాలన్నారు. అధికార పార్టీకి తలవంచాల్సి ఉండాల్సిన అవసరం లేదన్నారు. సర్పంచుల ఆత్మీయ సన్మానానికి నాగర్కర్నూల్ పట్టణాన్ని గులాబీమయం చేసి పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేసిన మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు.నాగర్ కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మాజీ మంత్రులు శ్రీనివాస్ గౌడ్, ఆవంచ లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు జైపాల్ యాదవ్, ఆల వెంకటేశ్వర్ రెడ్డి, బీరం హర్షవర్ధన్ రెడ్డి, కొడంగల్ మాజీ ఎమ్మెల్యే నరేందర్ రెడ్డి, టిఆర్ఎస్ నాయకులు బైకాని శ్రీనివాస్ యాదవ్, మహమ్మద్ ఇంతియాజ్ ఇసాక్ , పోకల మనోహర్, గెల్లు శ్రీనివాస్ యాదవ్, నరసింహ గౌడ్, గోలి శ్రీనివాస్ రెడ్డి, విజయుడు నాతోపాటు పలువురు మున్సిపల్ చైర్మన్లు మాజీ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# మేధా సంపత్తి తెలంగాణ కవులకు సొంతం

మొదటి పేజీ తరువాయి భాగం.
గంగవరం రామకృష్ణారెడ్డి సరళంగా సున్నితమైన అంశాలను స్పృశిస్తూ "ఖాళీ కుర్చీ"కవితా సంపుటిని రచించడం అభినందనీయమని వారికి శుభాకాంక్షలు తెలిపారు. వాగ్దానాల భంగానికి,అధికార ధర్మానికి కుర్చీ మోన సాక్షి గా ఉంటుందని సామూహిక బాధ్యతలను నెరవేర్చడం మన బాధ్యత అని గుర్తుంచుకోవాలని పిలుపునిచ్చారు. కవితా సంపుటి చిన్నదిగా ఉన్నా అందులోని నిగూఢార్థం సమాజానికి మంచి


ఖాళీ కుర్చీ పుస్తక ఆవిష్కరణ చేస్తున్న మాజీ మంత్రి

సందేశాన్ని ఇస్తుందని అన్నారు. దాశరథి రచించిన ఆ చల్లని సముద్ర గర్భం అనే గేయంలో ప్రకృతిలో ఉన్న అన్ని శాస్త్రాలను స్పృశిస్తూ సాగిందని ఈ గేయం వర్ధమాన, యువ కవులకు ఆదర్శం అన్నారు. ఖాళీ కుర్చీ కవిత వాగ్దాల భంగం వల్ల సమాజానికి ప్రమాదం అన్న ఒక మంచి సందేశం ఇవ్వడం హర్షణీయమని కొనియాడారు. గంగవరం రామకృష్ణా రెడ్డి మంచి రచయితగా ఎదగాలని ఆకాక్షి ంచారు. ఈ సభ సాహితీ కళా వేదిక అధ్యక్షులు పలుస శంకర్ గౌడ్ అధ్యక్షతన జరిగింది. కార్యక్రమంలో మాజీ జడ్పీ చైర్మెన్ లోక్ నాథ్ రెడ్డి, డా.వీరయ్య, నారాయణరెడ్డి, డా. సురేష్, విశ్వ, నాయకంటి నరసింహాశర్మ, బైరోజు చంద్రశేఖర్, గంధం నాగరాజు, నందిమల్ల అశోక్, ప్రేమ్ నాథ్ రెడ్డి, సూగురు మురళీ సాగర్, జోహెబ్ హుస్సేన్, మంద రాము నందిమల్ల అశోక్, జిల్లా బిఆర్ఎస్ మీడియా కన్వీనర్ తదితరులు పాల్గొన్నారు.

# పార్టీలో గ్రూపులకు తావులేదు

మొదటి పేజీ తరువాయి భాగం..
కోరారు. గ్రూపుల తగాదాలకు పోవద్దన్నారు. ఎవరైతే గ్రూపులు పెట్టాలనుకుంటే పక్కకు వెళ్లి గ్రూపులు పెట్టుకోవాలన్నారు. పార్టీ ఆఫీస్ కు రావద్దని ఏ నాయకుడైన మీకు సూచిస్తే నాకు దరఖాస్తు ఇవ్వండి వారిపై యాక్షన్ తీసుకుంటామన్నారు. నా సొంత నిర్ణయం ఏమీ ఉండదని, కమిటీ పార్టీ నిర్ణయిస్తుందన్నారు. ఆసక్తిగల వారి నుంచి దరఖాస్తులు తీసుకుంటామని, వారిపేరుపై సర్వే చేయించి సర్వేలో ఎవరి పేరు అయితే బాగుంటుందో స్థానం కల్పిస్తామన్నారు. సీనియర్ కార్యకర్తలు సర్వేలో రెండోస్థానంలో ఉన్నా వారికి టికెట్ ఇచ్చే ప్రయత్నం చేస్తామని అన్నారు. పార్టీ జెండాలు మోసిన వారికి అండగా ఉంటామని అన్నారు. పార్టీ కార్యాలయం నుంచి అశోక్టాకీస్ చౌరస్తాలోని గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఉపాధి హామీ పథకంలో మహాత్మాగాంధీ పేరు తీసివేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు డీసీసీ అధ్యక్షులు అన్నారు. ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తున్న కేంద్రం మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తున్నదని ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి ఆరోపించారు. ఆయన మాట్లాడుతూ వలసలను అరికట్టి, పేదరికాన్ని తగ్గించి స్థానికంగానే ఉపాధి కల్పించాలన్న ఉద్దేశంతో యూపీఏ ప్రభుత్వం ఉపాధిహామీ పథకం తీసుకొచ్చినట్లు తెలిపారు. ఈ పథకంలో మహాత్మాగాంధీ పేరును తొలగించడం సరికాదన్నారు. టీజీఎంఎప్సి చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి సభ్యుడిగా ఉండడం చాలా గర్వంగా ఉందన్నారు. అన్ని వర్గాల అభివృద్ధికి పాటు పడేది కాంగ్రెస్ పార్టీయేనని అన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ అనిత మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, నాయకులు చంద్రకుమార్ గౌడ్, దుష్యంత్ రెడ్డి వినోద్ కుమార్, జహీర్ అఖ్తర్, సురేందర్ రెడ్డి, అమరెందర్ రాజు, సీజె బెనహర్, సిరాజ్ ఖాద్రీ, వసంత, రాఘవేందర్ రాజు, మినాజ్, శివంత్ రెడ్డి, రాజేశ్వర్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, అజ్మత్ అలీ తదితరులు పాల్గొన్నారు.

# న్యూ ఇయర్‌పై ఆంక్షలు

- వేడుకలు జరుపుకునే వారు జాగ్రత్తలు పాటించాలి
- ప్రజా జీవనానికి భంగం కలిగిస్తే చట్టపరమైన చర్యలు
- జిల్లా వ్యాప్తంగా పటిష్ట పోలీస్ బందోబస్తు
- పెట్రోలింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు
- మహబూబ్‌నగర్ ఎస్పీ డి. జానకి వెల్లడి



**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబరు 28 ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ నూతన సంవత్సర వేడుకలు నిర్వహించుకునే ప్రజలు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని, ప్రమాదాలకు దూరంగా ఉండి పిల్లలు-పెద్దలు అందరూ తమ ఇండ్లలోనే కుటుంబ సభ్యులతో కలిసి ఉత్సవాలు జరుపుకోవాలని మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ డి. జానకి సూచించారు. పోలీసుల సూచనలు, నిబంధనలు పాటించడం ద్వారా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నివారించవచ్చని తెలిపారు. డిసెంబర్ 31 రాత్రి నూతన సంవత్సర వేడుకల సందర్భంగా జిల్లా పోలీస్ యంత్రాంగం తరపున పటిష్టమైన బందోబస్తు, నిరంతర పెట్రోలింగ్ ఏర్పాటు చేయబడుతుందని తెలిపారు. పట్టణ మరియు గ్రామీణ ప్రాంతాల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించబడతాయని అన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే విధంగా బహిరంగ ప్రదేశాల్లో వేడుకలు నిర్వహిస్తే చట్టప్రకారం తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రమాదకరంగా, ప్రజలకు ఇబ్బంది కలిగించే రీతిలో వేడుకలు జరపవద్దని స్పష్టం చేశారు.మహబూబ్‌నగర్ పట్టణానికి సంబంధించిన బైపాస్ రహదారి వెంబడి డిసెంబర్ 31 రాత్రి నిరంతర పెట్రోలింగ్ నిర్వహించబడుతుంది. ఈ మార్గంలో రాష్ డ్రైవింగ్, రాష్ రైడింగ్, బైక్ రేసింగ్, స్టంట్స్ వంటి ప్రమాదకర చర్యలకు ఎవరూ పాల్పడరాదు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ హెచ్చరించారు. డిసెంబర్ 31 రాత్రి ఆర్గనైజ్డ్ కార్యక్రమాలు నిర్వహించడానికి పోలీసు అనుమతి లేదు. వేడుకలను కుటుంబ సభ్యులతో కలిసి ఇండ్లలోనే జరుపుకోవాలి. పిల్లల పట్ల ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలి, మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదు.టపాసులు పేల్చడం, డీజేలు ఉపయోగించడం నిషేధం. మద్యం మత్తులో వాహనాలు నడపడం నేరం, అతివేగం వద్దు.రహదారులు బ్లాక్ చేసి ఉత్సవాలు నిర్వహించరాదు. ఇతరులకు ఇబ్బంది కలిగించే చర్యలకు పాల్పడవద్దు. ర్యాష్ డ్రైవింగ్, బైక్ రేసింగ్, త్రిబుల్ రైడింగ్, సైలెన్సర్లు తొలగించి వాహనాలు నడపడం, శబ్ద కాలుష్యం వంటి చర్యలపై కఠిన చర్యలు తీసుకుంటాం. న్యూ ఇయర్ వేడుకల్లో నిషేధిత డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాల విక్రయం లేదా వినియోగంపై కఠిన చర్యలు ఉంటాయి.మద్యం దుకాణాలు నిర్ణీత సమయానికే మూసివేయాలి, మైనర్లకు మద్యం విక్రయించరాదు. బహిరంగ ప్రదేశాలు, ప్రభుత్వ స్థలాల్లో మద్యం సేవిస్తే కేసులు నమోదు చేస్తాం. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ఏ కార్యక్రమమైనా నిర్వహించాలంటే తప్పనిసరిగా ముందస్తు పోలీసు అనుమతి తీసుకోవాలి.న్యూ ఇయర్ ఆఫర్ల పేరుతో సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడే అవకాశం ఉన్నందున, అపరిచితులకు వ్యక్తిగత సమాచారం, బ్యాంక్ ఖాతా వివరాలు, పిన్ నంబర్లు ఇవ్వవద్దు.అపరిచిత వ్యక్తుల ద్వారా వచ్చిన న్యూ ఇయర్ మెసేజ్‌లను ఓపెన్ చేయరాదు, ఫార్వర్డ్ చేయరాదు. అత్యవసర పరిస్థితుల్లో స్థానిక పోలీస్ అధికారులను లేదా డయల్ 100 కు ఫోన్ చేసి పోలీసు సేవలను వినియోగించుకోవాలని జిల్లా ఎస్పీ డి. జానకి ప్రజలను కోరారు.

# కాంగ్రెస్‌తోనే స్వాతంత్రం సాధ్యమైంది

### జూపల్లి అరుణ్ కుమార్ రావు

**చిన్నంబావి, డిసెంబరు 28 ప్రభాతవార్త :** దేశానికి స్వాతంత్రం సాధించి దేశ సమగ్రతకు కృషి చేసింది కాంగ్రెస్ పార్టీ అని దేశానికి దిక్సూచి కాంగ్రెస్ పార్టీ అని రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు తనయుడు జూపల్లి అరుణ్ కుమార్ అన్నారు. ఆదివారం కాంగ్రెస్ పార్టీ 141 వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు చంద్రశేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో చిన్నంబావి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించి జూపల్లి అరుణ్‌కి ఘన స్వాగతం పలికారు. అనంతరం చిన్నంబావి మండల కేంద్రంలో రాష్ట్ర మంత్రివర్యులు జూపల్లి కృష్ణారావు ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ 141 వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను జూపల్లి అరుణ్ కుమార్ ఘనంగా నిర్వహించడం జరిగింది. పెద్దదగడ నుండి చిన్నంబావి చౌరస్తా వరకు భారీ ఎత్తున కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించి అనంతరం చౌరస్తాలోని డా. బి.ఆర్ అంబేద్కర్, మహాత్మా జ్యోతి రావుపూలే విగ్రహాలకు పూలమాలలు వేసి,అనంతరం కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరించి కేక్ కట్ చేయడం జరిగింది. ఈ సందర్భంగా జూపల్లి అరుణ్ కుమార్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య


కాంగ్రెస్ జెండా ఆవిష్కరిస్తున్న దృశ్యం

పోరాటంలో పాల్గొని దేశానికి స్వాతంత్ర్యం అందించి ఎన్నో ఆవిష్కరణలు కాంగ్రెస్ పార్టీ చేసిందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు కృష్ణ ప్రసాద్ యాదవ్, రామచంద్రారెడ్డి, బీచుపల్లి యాదవ్, చిదంబర్ రెడ్డి, చంద్రశేఖర్ యాదవ్, జ్యోతి గౌడ్, పెరుమాళ్ శ్రీనివాస్, బక్కి శ్రీనివాస్, తేజ రెడ్డి, నూతన సర్పంచులు వడ్డేమాన్ బిచ్చన్న, కవితా ప్రభంజన గౌడ్, జయమ్మ లక్ష్మయ్య, సుజాత తాకారెడ్డి, పెంటమ్మ, మందకల్, ఆంజనేయులు, ఉప సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

# సంఘటిత శక్తితో ముందుకు సాగితే అభివృద్ధి

### ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**మహబూబ్‌నగర్, డిసెంబరు 28 ప్రభాతవార్త:** మాలల చైతన్య సమితి 10వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మహబూబ్‌నగర్ నగరంలోని టిఎన్‌జీఓ భవనం, తెలంగాణ చౌరస్తా వద్ద ఘనంగా నిర్వహించిన కార్యక్రమంలో గౌరవ మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన భారత రాజ్యాంగ నిర్మాత డా. బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, మాలల చైతన్య సమితి గత పదేళ్లుగా సమాజ హితం కోసం నిర్విరామంగా చేస్తున్న సేవలు అభినందనీయమని అన్నారు. విద్య, ఉపాధి, రాజకీయాలు, ఆర్థిక, సామాజిక రంగాల్లో మాలలు మరింత అభివృద్ధి సాధించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ముఖ్యంగా యువత చదువుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచిస్తూ, ప్రస్తుతం ప్రభుత్వ విద్యాసంస్థల్లో నాణ్యమైన విద్య అందుబాటులో ఉందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను సైతం భర్తీ చేశామని గుర్తు చేశారు. మన పిల్లలు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని ఎమ్మెల్యే హితవు పలికారు. సిగరెట్, గుట్కా, పాన్ మసాలా వంటి దుర్వ్యసనాల కారణంగా యువత జీవితాలు అర్థాంతరంగా ముగిసిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విధమైన అలవాట్లకు యువత ఆకర్షితులు కాకుండా తల్లిదండ్రులు, సమాజం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చదువే భవిష్యత్తుకు పునాది అని, అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని యువత అద్భుతాలు సృష్టించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ సంక్షేమ


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ రెడ్డి

పథకాలను సమర్థవంతంగా వినియోగించుకుంటూ, విద్యతో పాటు స్వయం ఉపాధి మార్గాల్లోనూ యువత నిలదొక్కుకోవాలని సూచించారు.సంఘటిత శక్తితో ముందుకు సాగితే అభివృద్ధి తప్పనిసరిగా సాధ్యమవుతుందని, ఐక్యతే నిజమైన బలమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. సమాజంలో ఉన్న వెనుకబాటుతనాన్ని తొలగించి సమాన అవకాశాలు పొందేందుకు మాలలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ దిశగా తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని భరోసా ఇచ్చారు. ఉచిత విద్య , నాణ్యమైన వైద్యం పేద ప్రజలకు అందించేందుకు అందరం కలిసి కృషి చేద్దామని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి మాల చైతన్య సమితి సభ్యులకు ఎమ్మెల్యే తినిపించారు. ఈ కార్యక్రమంలో మాలె కేశవులు, పత్తి యాదయ్య బి రామకృష్ణ పంబా వెంకటస్వామి, ఎం.సుధాకర్, దాసరి శ్రీనివాసులు, ఎం రాములు, గజ్జల చెన్నయ్య, కావలి చెన్నయ్య, తిరుపతయ్య, పెరుమళ్ళ గోవిందయ్య తదితరులు పాల్గొన్నారు.

# రెడ్ క్రాస్ సేవలు అభినందనీయం

### విద్యార్థుల ఆరోగ్యం, సంక్షేమమే సమాజ భవిష్యత్తుకు పునాది ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబరు 28 ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తూ ప్రభుత్వ హాస్టళ్లలో నివసిస్తున్న విద్యార్థులు చలికాలంలో ఆరోగ్యపరంగా ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొనకుండా ఉండాలనే సదుద్దేశంతో రెడ్ క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో బెడ్‌షీట్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం మహబూబ్‌నగర్ నగరంలోని బోయపల్లి ఎస్టీ హాస్టల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై హాస్టల్‌లో నివసిస్తున్న విద్యార్థులకు స్వయంగా బెడ్‌షీట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, సమాజ సేవే లక్ష్యంగా నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న రెడ్ క్రాస్ సంస్థ సేవలు ప్రశంసనీయమని అన్నారు. ముఖ్యంగా పేద, గిరిజన, వెనుకబడిన వర్గాల విద్యార్థుల సంక్షేమానికి రెడ్ క్రాస్ సంస్థ అందిస్తున్న సహకారం అభినందనీయమని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తూ, విద్యార్థుల ఆరోగ్యం, సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించాలని రెడ్ క్రాస్ సంస్థను ఆయన కోరారు. ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. విద్యార్థులు చదువుపై దృష్టి


విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ రెడ్డి

పెట్టాలని, కష్టపడి చదివి మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలని ఆయన సూచించారు. విద్యే నిజమైన ఆస్తి అని, విద్యార్థుల అవసరాలకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మారేపల్లి సురేందర్ రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ,నాయకులు ఖాజాపాషా,అజ్మత్ అలి తదితరులు పాల్గొని, విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే రెడ్ క్రాస్ సంస్థ ప్రతినిధులు,హాస్టల్ నిర్వాహకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే యెన్నం చేతుల మీదుగా క్యాలెండర్ ఆవిష్కరణ

**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబరు 28 ప్రభాతవార్త :** పిఆర్‌టియు టిఎస్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సరం 2026 క్యాలెండర్ ను మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ఆవిష్కరించారు. పిఆర్‌టియు టిఎస్ జిల్లా అధ్యక్షు లు మదన్ మోహన్ యాదవ్, ప్రధాన కార్యదర్శి జి.సుధాకర్ రెడ్డి, గౌరవ అధ్యక్షులు వి. బుచ్చారెడ్డిల ఆధ్వర్యంలో ఆదివారం మహబూబ్‌నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పిఆర్‌టియు టిఎస్ క్యాలెండర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యెన్నం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి పెద్దపీట వేస్తుందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల కు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు, విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధనకు ప్రాధాన్యతనిస్తున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపా రు. ఈ కార్యక్రమంలో పిఆర్‌టియు టిఎస్ జిల్లా అధ్యక్షులు మదన్ మోహన్ యాదవ్, ప్రధాన కార్యదర్శి జి.సుధాకర్ రెడ్డి, గౌరవ అధ్యక్షులు బుచ్చారెడ్డి, మాజీ అధ్యక్షులు గట్టు వెంకట్ రెడ్డి, మాజీ ప్రధాన కార్యదర్శి రఘు రామ్‌రెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు లయన్ అశ్విని చంద్రశేఖర్, నాగేశ్వర్ రెడ్డి, మండల, జిల్లా, రాష్ట్ర బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.


పిఆర్‌టియు టిఎస్ క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

# ప్రాణం తీసిన పతంగి..

- కైట్ కొనివ్వలేదని తల్లిదండ్రులను
- భయపెట్టేందుకు ప్రయత్నించినా చిన్నారి..
- చీర మెడకు బిగుసుకుని బాలుడు మృతి
- మహబూబ్‌గర్ జిల్లా మిడ్జిల్ మండలం చిల్వేర్‌లో ఘటన

**జడ్చర్ల, మిడ్జిల్, డిసెంబర్ 28 ప్రభాతవార్త :** తల్లిని భయపెడుదాం అని పోయి బిడ్డ తన ప్రాణాలు తీసుకున్న ఘటన మహబూబ్‌గర్ జిల్లా మిడ్జిల్‌లో చోటు చేసుకున్నది. వివరాల్లోకి వెళ్తే మిడ్జిల్‌లో మండలం చిల్వేర్ గ్రామానికి చెందిన జక్కా రాజు, శ్రీలత దంపతులకు సిద్ధూ (9) బాలుడు ఉన్నాడు. తల్లితండ్రులను పతంగి ఇప్పించుమని కోరిన బాలుడు తల్లిదండ్రులు నిరాకరించడంతో వాళ్లను బెదిరించే ప్రయత్నం చేశాడు. అందులో భాగంగా ఇంట్లోనే చీరతో స్లాపుకు ఉరి వేసుకునే ప్రయత్నం చేశాడు. ప్రమాదవశాత్తు మెడకు చీర బిగిసుకుపోవడంతో బాలుడు ఎక్కడికక్కడే మృతి చెందాడు. బాలుడు అదే గ్రామంలో రెండవ తరగతి చదువుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. తల్లిదండ్రులను భయపెడుదామని చూసి చివరికి తన ప్రాణాలే కోల్పోవడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. విషయం తెలిసిన ప్రజలందరూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## ట్రాక్టర్ కిందపడి బాలుడి మృతి

### జడ్చర్ల మండలం చిన్న ఆదిరాలలో విషాదం

**జడ్చర్ల, డిసెంబరు 28 ప్రభాతవార్త :** ఐదేళ్ల బాలుడు ట్రాక్టర్ కింద పడి మృత్యువాత పడ్డ ఘటన జడ్చర్ల మండలంలోని చిన్న ఆదిరాలలో చోటు చేసుకున్నది. వివరాల్లోకి వెళ్తే చిన్న ఆదిరాల గ్రామానికి చెందిన శివకుమార్ ఉమారాణి దంపతులకు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. రోజులాగే వ్యవసాయ పనుల నిమిత్తం ట్రాక్టరును తీసుకొని శివకుమార్ పొలానికి వెళ్లాడు. ఆదివారం వ్యవసాయ పనులు చేస్తూ ట్రాక్టర్‌కు తాళం అలాగే మర్చిపోయాడు. అదే క్రమంలో ఆడుకుంటూ వెళ్లిన బాలుడు ఆన్ చేయడంతో ట్రాక్టర్ ఒక్కసారిగా ముందుకు వెళ్లడంతో ట్రాక్టర్ కింద పడి బాలుడు అక్కడికక్కడే మృతి చెందాడు. గమనించిన తల్లిదండ్రులు బాలుడి దగ్గరకు వెళ్లి చూడగా అప్పటికే బాలుడు విగతజీవిగా పడి ఉన్నాడు. ఈ విషాద ఘటన చూసిన తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు. తన వ్యవసాయ పొలం పనుల నిమిత్తం గత రెండు రోజుల కిందటే ట్రాక్టర్ ను కొనుగోలు చేయగా ఇంతలోనే ఇలా జరగడం కుటుంబంలో మరింత విషాదాన్ని నింపింది.

## భూత్పూర్ మున్సిపాలిటీకి కొత్త సొబగులు

మొదటి పేజీ తరువాయి భాగం.
నడిపేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు పూర్తి సహకారమందించాలన్నారు.మున్సిపాలిటీకి టీడీఎస్ పథకం కింద రు.3కోట్లు,ముడా నుంచి దాదాపు రు.కోటి నిధులు మంజూర్యాయని,వీటిని మున్సిపాలిటీ అభివృద్ధి పనులకు వెచ్చించాలని సూచించారు.మున్సిపాలిటీలోని పదివార్డులకు వార్డుకు రు.30లక్షల చొప్పున నిధులు వెచ్చించి అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు.పట్టణంలో రు.20లక్షలతో ఆత్యాధునికంగా హైమాస్ట్ లేట్లనేర్పాటు చేయాలని సూచించారు. మున్సిపాలిటీలోని 6.7వార్డులలో రు.12లక్షలతో వాటర్‌ప్లాంట్లనేర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే జీఎంఆర్ ప్రకటించారు .రు.38లక్షలతో కమ్యూనిటీ భవనాల నిర్మాణాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ పనులను వచ్చే నెల 4,5తేదీలలో ప్రారంభిస్తున్నట్లు ఎమ్మెల్యే జీఎంఆర్ ప్రకటించారు.వీటితో పాటు మున్సిపాలిటీల అభివృద్ధి నిధుల నుంచి మంజూరైన రు.15కోట్ల పనులను నెల రోజులలో సత్వరం ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత మున్సిపల్ కమిషనర్ నూరుల్ నజీబ్‌ను ఎమ్మెల్యే జీఎంఆర్ ఆదేశించారు. సమీక్షా సమావేశంలో మున్సిపల్ కమిషనర్ నూరుల్ నజీబ్‌తో పాటు ఇంజనీర్ వినోద్‌కుమార్ ఇతర అధికారులు పాల్గొన్నారు.ఎమ్మెల్యే వెంట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు లిక్కి నవీన్‌గౌడ్,మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి,మాజీ ఎంపిపి కదిరె శేఖర్‌రెడ్డి పార్టీ మండల ప్రధాన కార్యదర్శి లిక్కి విజయ్‌గౌడ్, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు రేకులపాటి భూపతిరెడ్డి,మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కెంద్యాల పద్మ,సర్పంచులు తాళ్లగడ్డ సంజీవరెడ్డి,మలిశెట్టి మున్నూర్ వెంకటేష్,పాత్లావత్ తారు నాయక్‌తో పాటు పార్టీ నాయకులు హరియా నాయక్,బోరింగ్ నర్సింహులు,మశ్చేందర్,గడ్డం ఎల్లప్ప,గడ్డం యాదయ్య,గడ్డం శ్రీనివాసులు,రేకులపాటి రఘుపతి రెడ్డి,మల్లేష్,కెంద్యాల రాజేష్,కొరె పవన్,కొండన్న తదితరులున్నారు.